ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 10 అక్టోబరు 2025 | 5





నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఏడు వారాల వెంకన్నగా పిలుచుకునే.. వాడపల్లి వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. 18వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. ఈ మేరకు ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. 6

బదిలీ టైమ్..

రాజమహేంద్రవరం/చింతూరు/కాకినాడ కలెక్టరేట్ /కాకినాడ కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నలుగురు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. వీరిలో ముగ్గురిని ఇక్కడికిక్కడే సర్దుబాటు చేసే శారు. కాకినాడ జేసీ రాహుల్ మీనా రాజమహేం ద్రవరం కమిషనర్‌గా నియమితులయ్యారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ కాకినాడ జేసీగా నియమితులయ్యారు.రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌కు చింతూరు బాధ్యతలు అప్పగించారు. కాకినాడ కమిషనర్ భావన బాపట్ల జేసీగా బదిలీ అయ్యారు.

రాజమండ్రి కమిషనర్‌గా మీనా



రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్‌గా 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాహుల్ మీనా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సి పల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.రాహుల్ మీనా ప్రస్తుతం కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా ఏడాది పాటు పనిచేశారు. అంతకుముందు ఈయన మార్కాపురం సబ్ కలెక్టర్‌గా కూడా విధులు నిర్వహించారు.రాజమ హేంద్రవరం కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కలెక్టర్ కీర్తి చేకూరి ఉన్నారు.

కాకినాడ జేసీగా అపూర్వ భరత్



చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భరత్ 2024 ఆగస్టు 30న చింతూరు ఐటీడీఏ సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించారు.ఈ ఏడాది ఆగస్టు 25న శిక్షణ నిమిత్తం ఆయన డెహ్రాడూన్‌కు వెళ్లారు. నవంబరు 25న శిక్షణ పూర్తి కానుంది. భరత్ లక్నోలో గౌతమ్ బుద్ధ టెక్నికల్ యూనివర్శిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చేశారు.

కాకినాడ కమిషనర్ భావన బదిలీ



కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం జీవో నెంబర్ 1844 విడుదల చేసింది. 2024 జూలైలో కాకినాడ కమిషనర్‌గా భావన బాధ్యతలు బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా భావన బదిలీ అయ్యారు.

చింతూరు సబ్ కలెక్టర్‌గా శుభం నొక్వాల్



రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌కు చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా ఎఫ్ఏసీ (ఫుల్ అడిషనల్) బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.దీంతో ప్రస్తుతం శుభం నొక్వాల్ సబ్ కలెక్టర్,ఐటీడీఏ పీవోగా కొనసాగుతారు.



విస్ఫోటనం.. ఉలికిపాటు

- రాయవరం బాణసంచా ఘటనతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- మూడు రోజులపాటు విస్తృత తనిఖీలకు కలెక్టర్ ఆదేశం
- బాధ్యులపై చర్యలకు అవకాశం

పేలుడుపై దర్యాప్తునకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

ఏడు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

మృత్యువుతో పోరాడి ఓడిన విజయలక్ష్మి

8కి చేరిన మృతులు 7

మండపేట, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): రాయవరం సమీపంలో జరిగిన బాణసంచా పేలుడుతో జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా బాణసంచా తయారీ కేంద్రాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇవన్నీ దశాబ్దాల తరబడి ఇదే పనిలో ఉంటూ వస్తున్నాయి. దీపావళి సమయంలో కోట్లాది రూపాయల మేర బాణసంచా తయారీకి మూడు నాలుగు నెలల ముందు నుంచే సిద్ధమవుతాయి. ఆ మేరకు పదుల సంఖ్యలో కార్మికులను నియమించుకుని తయారీలో నిమగ్నమవుతాయి. పండుగ సమయం దగ్గర పడడంతో బాణసంచా తయారీ తుది దశకు చేరింది. ఈ క్రమంలో రాయవరంలో జరిగిన ఈ దుర్ఘటన అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. అయితే ఈ బాణసంచా యజమాని మృతి చెందడం, తయారీకి సంబంధించిన అన్ని నిబంధనలు పాటించినట్టు ప్రాథమికంగా గుర్తించడంతో అధికార యంత్రాంగం కొంత ఊరట చెందింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై పూర్తి దర్యాప్తునకు ఆదేశించింది. దీనికి ఉన్నత స్థాయి కమిటీని సైతం నియమించింది. ఈ ఘటన వెనుక కారణాలను వెలికితీయాలని కమిటీని ఆదేశించింది. దీంతో జిల్లా యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. కింది స్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను, దానికి బాధ్యులను గుర్తించే దిశగా ఉన్నతాధికారులు చర్యలకు దిగినట్టు సమాచారం. బాణసంచా తయారీకి సంబంధించి ప్రధానంగా మూడు ప్రభుత్వ శాఖల ప్రమేయం ఉంటుంది. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల పర్యవేక్షణ తప్పనిసరి. ఈ దుర్ఘటనలో ఏకంగా ఇప్పటివరకు 8 మంది మృతి చెందడంతో ఈ ప్రమాద తీవ్ర మరింత పెరిగింది. సాధారణంగా అనుమతులకు సంబంధించి రెవెన్యూ, పోలీసు, ఫైర్ శాఖల తనిఖీలు చాలా కీలకం. క్షేత్రస్థాయి పరిశీలనలు, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది మండల స్థాయి సిబ్బందిదే కీలక పాత్ర. బాణసంచా కేంద్రాల్లో తయారీ సమయంలో కూడా నిరంతర పర్యవేక్షణ కూడా ఈ శాఖల అధికారులు తరచు చేయాల్సి ఉంటుంది. అలాగే మందుగుండు తయారై నిల్వ ఉంచిన గొడౌన్‌లను కూడా తనిఖీ చేయాలి. సంయుక్తంగా ఈ తనిఖీలు జరిగాయా లేదా అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నత స్థాయి కమిటీ దర్యాప్తుతోపాటు శాఖాపరంగా జిల్లాలో జరిగే విచారణలో ఎవరు బాధ్యులనే విషయం తేల్చాల్సి ఉంది. దీంతో మండల స్థాయి అధికారులు, సిబ్బందిలో వణుకు మొదలైంది. ముఖ్యంగా ప్రతిసారీ బాణసంచా పేలుడు సంఘటనలు జరిగినప్పుడు సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులపై వేటు వేయడం, వైఫల్యాలపై సమీక్షించుకోవడం సాధారణంగా జరిగేదే. అయితే ఈ ఘటనకు సంబంధించి ప్రాథమిక విచారణలో యజమానికి అన్ని అనుమతులు ఉండడంతోపాటు నిబంధనలు పాటిస్తున్నారని గుర్తించారు. అలాగే కొద్ది రోజుల కిందటే తనిఖీలు చేశామని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు విన్నవించారు. అయితే పూర్తి స్థాయి విచారణ తర్వాతే వాస్తవ పరిస్థితులు వెల్లడయ్యే అవకాశం ఉంది. దాంతో దర్యాప్తు తేలేవరకు వేచిచూస్తారా, లేదా సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటారా అనేదానిపై చర్చ జరుగుతోంది. దీనికి అనుగుణంగానే ప్రభుత్వం కూడా ఎవరు బాధ్యులో తేల్చాలని స్పష్టంగా పేర్కొనడంతో స్థానిక అధికారుల్లో ఆందోళన పెరిగిపోయింది. ప్రమాదానికి కారణమేంటి, ఎలా జరిగింది అనే విషయాలను తేల్చేందుకు విజయవాడకు చెందిన ఫోరెన్సిక్ నిపుణులు రంగంలో దిగారు. శాంపిల్స్ సేకరించారు. వీరి నివేదిక కూడా వస్తే ప్రమాదంపై స్పష్టత వస్తుంది. ఈలోపు శాఖాపరమైన విచారణ కూడా జరిగితే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మిగిలిన వాటి మాటేంటి...

రాయవరంలో బాణసంచా ఘటనతో అటు తయారీ, విక్రయదారులు.. ఇటు అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. జిల్లా యంత్రాంగం అన్ని కేంద్రాలను తనిఖీ చేస్తుండడంతో వ్యాపారులు అప్రమత్తమయ్యారు. అధికారులు గురువారం పలుచోట్ల తనిఖీలు చేపట్టారు. అయితే ఇలా ప్రమాదం జరిగినప్పుడు మూడు నాలుగురోజులు దుకాణాలు బంద్ చేసి తర్వాత షరా మామూలుగానే బాణసంచా తయారీ చేపడుతుంటారు. అధికారులు కూడా పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు ఉండవు. దీనికి ప్రధాన కారణంగా పెద్దఎత్తున మామూళ్లు అందడమే. నిబంధనలు పాటించకుండా అనేక సంస్థలు బాణసంచా తయారీని చేపడతాయి. హోల్‌సేల్ వ్యాపారులదీ అదే తీరు. సరైన రక్షణ వ్యవస్థలు ఏర్పాటుచేయకుండా మంచి లాభాలను అందించే ఈ వ్యాపారాన్ని చక్కబెట్టేస్తారు. ఇటీవలే మండపేటలో అనుమతులు లేకుండా సిద్ధం చేసిన రూ.5 లక్షల విలువైన బాణసంచా సీజ్‌చేశారు. ఇక ముడి సరుకు విక్రయించే దుకాణాలు ఉన్నాయి. వాటిపైనా సరైన పర్యవేక్షణ ఉండడం లేదు. ఈసారైనా బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాలపై పూర్తి స్థాయి పర్యవేక్షణ ఉంటేనే ప్రజల ప్రాణాలకు రక్షణ ఉంటుంది.



కొత్తపేటలో బాణసంచా తయారీ కేంద్రాన్ని గురువారం పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా

బాణసంచా తయారీదారులు నిబంధనలు పాటించాలి : ఎస్పీ

కొత్తపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని మందుగుండు సామగ్రి తయారీచేసే కర్మాగారాల యజమానులు ఫైర్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా స్పష్టంచేశారు. గురువారం కొత్తపేట పరిధిలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి ఫైర్ నిబంధనలు ఏవిధంగా పాటిస్తున్నారో క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారికి ఉన్న లైసెన్సులను పరిశీలించారు. ఫైర్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్పీ వెంట రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్బీ సీఐ పుల్లారావు, ఎస్ఐ జి.సురేంద్ర పాల్గొన్నారు.



మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా.. ఇదే నా ఆన!

ఉప్పాడ సభలో డిప్యూటీ సీఎం పవన్

- వంద రోజులు గడువు ఇవ్వండి
- పారిశ్రామిక కాలుష్యంపై ఆడిట్
- మత్స్యకారుల ఆవేదనకు బాధపడ్డా
- అందుకే మీ ముందుకు వచ్చా
- మీకు న్యాయం చేస్తా
- పవన్ హామీతో ఆనందం

(కాకినాడ,యు.కొత్తపల్లి,పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

మత్స్యకారుల సమస్యలను వంద రోజుల్లో పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు.పిఠాపురం నియోజకర్గం యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో పవన్‌కల్యాణ్ గురువారం సాయంత్రం బహిరంగ సభలో ప్రసంగించారు. సముద్రంలో కలుస్తున్న పారిశ్రామిక వ్యర్థ జలాలు ఏ మేరకు ఉన్నాయనే దానిపై ఆడిట్ చేయడానికే వంద రోజుల గడువు అని తెలిపారు. నాలుగు రోజులు ధర్నా చేస్తే ఐదో రోజే పరిష్కారం అవదని.. మ త్స్యకారులు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేను మీలో ఒకడిని..

తాను డిప్యూటీ సీఎం..పిఠాపురం ఎమ్మెల్యేను కాదని..మత్స్యకారుల్లో ఒకడినని పవన్ సభలో పేర్కొనడంతో చప్పట్లు మార్మోగాయి.మత్స్యకారులంటే నాకు అభిమానం, ప్రేమ. మిమ్మల్ని ఎగదోసి పబ్బం గడుపుకునే నాయకులను మాత్రం నమ్మవద్దన్నారు.ఉప్పాడ కొత్తపల్లి మండలంలో మత్స్యకారులు కొంతకాలం కిందట నాలుగు రోజులు ధర్నాలు, ఆందోళనలు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు.మత్స్య సంపద అంతరించిపోతుందనే వారి ఆవేదన తనకు బాధ కలిగించిందన్నారు.అందుకే సమస్య పరిష్కారానికి ఏం చేయాలనేదానిపై అధికారులు, అన్ని పార్టీలు, మత్స్యకార సంఘాల నాయకులతో కలెక్టరేట్‌లో గురువారం ఉదయం సమావేశమై చర్చించినట్టు వివరించారు. ఆరోగ్యం బాగోలేక వెంటనే రాలేకపోయానని..ఈ నెల 10న వస్తానని చెప్పినా ప్రజల కోసం ఒకరోజు ముందుగానే వచ్చానన్నారు. మత్స్య కార సంఘాల నేతలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పవన్ కల్యాణ్ సభలో ఒక్కొక్కటిగా వివరించారు. నక్కపల్లి,కాకినాడ సెజ్‌లు, దివీస్, అరబిందో, డెక్కన్ తదితర పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంవల్ల వేట దొరకడం లేదని మత్స్యకారులు తెలిపారని, ఇవి కాంగ్రెస్ ప్రభు త్వంలో వచ్చాయన్నారు.ఈ కాలుష్యం ఏ స్థాయిలో ఉందనేది మత్స్యకా రులు తనకు వివరించారని..అందుకే మూడు రోజుల్లో కాకినాడ పోర్టు నుంచి సముద్రంలోకి వెళ్లి కాలుష్యం జాడలను పరిష్కరిస్తానని పవన్ హామీ ఇచ్చారు.అమీనాబాద్ హార్బర్ డిజైన్ లోపం వల్ల పడవలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్న విషయమై సమస్య పరిష్కరిస్తామన్నారు. స్థానికంగా మత్స్యసంపద దొరకనప్పుడు అంత ర్వేది, మచిలీపట్టణం, నిజాంపట్నం తదితర ప్రాంతాలకు వేటకు వెళ్తే ఇబ్బంది పెడుతున్నారన్న విషయమై ఇప్పటికే మంత్రి కొల్లు రవీంద్ర,రాజోలు ఎమ్మెల్యేతో చర్చించగా, సమస్య పరిష్కారమైందన్నారు.ఇక నుంచి ఉప్పాడ మత్స్యకా రులు వేటకు అటువైపు వెళ్ల వచ్చని ప్రకటించారు.రింగుల వలలు వాడొద్ద న్నారు. ఎన్ని ఇబ్బందులు పడినా ఉప్పాడ రక్షణ గోడ నిర్మించడం తథ్యం అన్నారు. ఉప్పాడ-కోనపాప పేట తీర ప్రాంతంలో రూ.5.72 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నామన్నారు. పది రోజుల కోసారి డిప్యూటీ సీఎం కార్యాలయం, కూటమి నాయకులు ద్వారా ఎప్పటికప్పుడు జరుగుతున్న విషయాలను తెలియజేస్తారన్నారు.



చూడండి సార్ : పవన్‌తో మాజీ ఎమ్మెల్యే వర్మ

పర్యటన సాగిందిలా..

ఉదయం 10:30 గంటలకు పవన్ హెలీకాప్టర్‌లో కాకినాడ పోలీసు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు.అక్కడి నుంచి 11.30 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అనంతరం 2.30 గంటలకు జీఆర్టీ హోటల్‌కు చేరుకుని పార్టీ నేతలతో ముచ్చటించారు. సాయంత్రం ఉప్పాడలో సభ ముగించుకుని హెలీకాప్టర్‌లో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని తిరిగి వెళ్లారు.



కలెక్టరేట్‌లో మత్స్యకార సమస్యలపై చర్చిస్తున్న పవన్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎంపీ ఉదయ్ తదితరులు

జిల్లాలో 37 బాణసంచా సంస్థలపై తనిఖీలు నిర్వహించండి : కలెక్టర్ ఆదేశం

అమలాపురం, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ యూనిట్లు హోల్‌సేల్ విక్రయకేంద్రాలకు లైసెన్సులు, భద్రత రక్షణ ప్రమాణాలు వంటి అంశాలపై మూడు రోజులపాటు పర్యవేక్షణ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ నుంచి ఆర్డీవోలు, డీఎస్పీలు, తహశీల్దార్లు, ఫైర్‌శాఖ, లేబర్ డిపార్టుమెంట్ అధికారులతో బృందాలను ఏర్పాటుచేసి బాణసంచా తయారీ, హోల్‌సేల్ దుకాణాలను తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. రక్షణ చర్యలు, భద్రత అంశాలపట్ల యజమాన్యం తీసుకుంటున్న చర్యలతోపాటు ఆ సంస్థల్లో గుర్తింపు పొందిన కార్మికులు పనిచేస్తున్నారా లేదా అనేది పరిశీలన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాయవరం లాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా మూడు రోజులపాటు తనిఖీలు చేపట్టి అక్కడ నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్టు తేలితే వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 18 తయారీ యూనిట్లు 19 హోల్‌సేల్ షాపులు ఉన్నాయని, వీటికి అన్ని రకాల అనుమతులు పరిశీలించాల్సిందిగా బృందాలను కలెక్టర్ ఆదేశించారు. శనివారం యంత్రానికి నివేదిక అందించాలని కోరారు. జనవాసాలకు దూరంగా బాణసంచా దుకాణాలు ఉన్నాయోలేదా పరిశీలనతోపాటు మైనర్ ఉల్లంఘనలకు పాల్పడితే వాటిని సీజ్‌చేయాలని ఆదేశించారు. బాణసంచా తయారీలో ప్రామాణికంగా వాడే రసాయాలను పరిశీలించాలని ఆదేశించారు. ఈనెల 20వ తేదీన దీపావళి ఉన్న దష్ట్యా షాపుల విక్రయాలకోసం దరఖాస్తులు చేసుకునేవారిని ముందే గుర్తించాల్సిందిగా సూచించారు. కార్మికులకు బీమాతోపాటు ఇతర సౌకర్యాలు వర్తిస్తున్నాయా, ఏడాదిలో ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నారనే సమాచారం ఈ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. స్కిల్డ్ వర్కర్ల సర్టిఫికెట్లను పరిశీలించాల్సిందిగా సూచించారు. దీపావళికి నిర్వహించే వ్యాపారులకు ముందుగానే లైసెన్సులు మంజూరు చేయాలన్నారు. 10, 15 కిలోల సామగ్రి తయారు అయిన తరువాత వాటిని వేరే ప్రాంతానికి తరలించి ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. 18 ఏళ్ల లోపు పిల్లలను ఈ పనులకు దూరంగా ఉంచాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.

మా సమస్యలకు పరిష్కారం చూపండి!

పవన్‌కు ఎమ్మెల్యే దాట్ల వినతి



పవన్‌కు వినతిపత్రం అందించి వివరిస్తున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): గురువారం పిఠాపురం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కలిసి నియోజకవర్గం సమస్యలపై ఆయనకు వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పవన్ అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

రహదారులకు మోక్షం

- రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలో పది పనులకు రూ.29.50 కోట్లు విడుదల
- స్టేట్ హైవేస్‌లో ఆరు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్‌లో నాలుగు పనులు
- ఈనెలాఖరుకు టెండర్లు పూర్తయ్యే అవకాశం



పి.గన్నవరం మండలంలో మానేపల్లి రోడ్డు

పి.గన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం రోడ్లను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. కొత్త రోడ్లతోపాటు రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయిస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్‌కు సంబంధించి బీటీ, సీసీ రహదారుల అభివృద్ధి జరుగుతోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో రోడ్ల మరమ్మతుల నిమిత్తం స్టేట్ హైవేస్, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లకు వెయ్యి కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీవోని విడుదల చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో ఆర్అండ్‌బీ రోడ్లకు సంబంధించి పది పనులకుగాను రూ.29.45 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈనెలాఖరుకు టెండర్లు పూర్తిచేసుకుని అగ్రిమెంట్‌లు అనంతరం నవంబరు మొదటి వారంలో రోడ్ల పనులు ప్రారంభించే అవకాశం ఉందని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా స్టేట్ హైవేస్ (ఎస్‌హెచ్‌ఎస్)కు సంబంధించి సిరిపల్లి-మునిపల్లి రోడ్డు 4.80 కిలోమీటర్లు మేర రహదారి అభివృద్ధికి రూ.3.50కోట్లు, రాజవరం-పొదలాడ రహదారిలో 8 కిలోమీటర్లు మేర రహదారి అభివృద్ధికి రూ.3.90 కోట్లు, మండపేట-దుళ్ల రోడ్డు 1.04 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.3.50కోట్లు, సోమేశ్వరం-రాజానగరం రోడ్డు అభివృద్ధికి 4.26 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధికి రూ.3.50 కోట్లు, మానేపల్లి గ్రామంలో 500 మీటర్ల మేర సీసీ రోడ్డుగా అభివృద్ధికి రూ.2 కోట్లు, మొగలికుదురు-జగ్గన్నపేట రోడ్డు ఒక కిలోమీటరు మేర అభివృద్ధికి రూ.2.20 కోట్లు నిధులు కేటాయించారు. అలాగే మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లుకు సంబంధించి ముమ్మిడివరం-ముక్తేశ్వరం రోడ్డులో 2.07 కిలోమీటర్లు మేర అభివృద్ధికి రూ.2.15 కోట్లు, ముమ్మిడివరం- కాట్రేనికోన రోడ్డులో 4.75 కిలోమీటర్లు మేర రహదారి అభివృద్ధికి రూ.3.90 కోట్లు, మురముళ్ల-ఎదుర్లంక రోడ్డులో 0.53 కిలోమీటర్లు మేర రహదారి అభివృద్ధి నిమిత్తం రూ.60 లక్షలు, విశ్వేశ్వరపురం-దిండి, గూడపల్లి-కేశనపల్లి, పెదపట్నంలంక -దొడ్డవరం రోడ్లకు సంబంధించి 14 కిలోమీటర్లు మేర అభివృద్ధి నిమిత్తం స్పెషల్ ప్యాకేజీలో రూ.4.80 కోట్ల నిధులను మంజూరు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేసింది.

17న కేశనపల్లిలో పవన్ పర్యటన

శంకరగుప్తం డ్రైన్ ముంపు వల్ల జరిగిన నష్టం పరిశీలనకు రాక 7

ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుని కర్ణాటక సంగీతం, అన్నమాచార్య కీర్తనల ద్వారా దేశ, విదేశాల్లో ప్రాచుర్యం పొందిన ఆయన చేసిన కచేరీలు, ఆలపించిన కీర్తనలు కళాభిమానుల చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. అన్నమాచార్యుల కృతులకు బాణీలు కట్టి, కర్ణాటక సంగీతానికి వన్నెలద్దిన 'సంగీత కళానిధి', ప్రముఖ సంగీత విద్వాంసుడు నేదునూరి కృష్ణమూర్తి జయంతి శుక్రవారం జరగనున్నది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



సంగీత కళానిధి నేదునూరి

కర్ణాటక సంగీతానికి వన్నెలద్దారు
అన్నమాచార్యుల కృతులకు బాణీలు.. నేడు కృష్ణమూర్తి జయంతి

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పిఠాపురం మహారాజా ఎస్టేట్‌లో పనిచేసిన నేదునూరి శ్రీరామమూర్తిపంతులు-విజయలక్ష్మి దంపతులకు కృష్ణమూర్తి 1927 అక్టోబరు 10వ తేదీన జన్మించారు. (ఈయన కొత్తపల్లిలో జన్మించినప్పటికీ పిఠాపురాన్ని జన్మస్థలంగా చెబుతారు) తన తల్లి, మేనమామ ద్వారా సం గీతంపై ఆసక్తి పెంచుకున్న ఆయన 1940లోనే విజయనగరంలోని మహారాజా మ్యూజికల్ కళాశాలలో వయొలిన్, సంగీతం నేర్చుకున్నారు. తొలుత ద్వారం నరసింగరావునాయుడు వద్ద, తదనంతరం పద్మభూషణ్ శ్రీపాద పినాకపాణి ద్వారా సంగీతాన్ని పూర్తిగా అవపోశన పట్టారు. ఆల్ ఇండియా రేడియోలో అగ్రగణ్య కళాకారుడిగా గుర్తింపు పొందారు. 1945లో 18 ఏళ్ల వయసులోనే పలు సంగీత ప్రదర్శనలు ఇచ్చారు. 1950 వరకు పిఠాపురంలోనే నివసించిన ఈయన తర్వాత ఇక్కడి నుంచి వెళ్లి విశాఖపట్నంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఆయన మద్రాసు మ్యూజిక్ అకాడమీలో ఐదు దశాబ్దాలకు పైగా సంగీత కచేరీలు నిర్వహించారు. తదనంతరం కంచికామకోటి పీఠం, తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గమ్మవారి దేవస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా పనిచేశారు.

ఒక్క కీర్తనకే సంగీత కళానిధి ఇవ్వొచ్చు

నానాటి బతుకు నాటకము... అన్నమాచార్య కీర్తనకు నేదునూరి కృష్ణమూర్తి కట్టిన బాణీని ఆలకించిన ప్రముఖ గాయకురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి ఈ ఒక్క పాటకు బాణీ కట్టినందుకు మీకు సంగీత కళానిధి ఇవ్వవచ్చు అంటూ చేసిన ప్రశంస నేదునూరి ప్రతిభకు అద్దంపట్టింది. దేశ, విదేశాల్లో నేదునూరి చేసిన అన్నమాచార్య సంకీర్తనలు మంచి ప్రాచుర్యం పొందాయి. అనేక అన్నమయ్య కృతులకు బాణీలు కట్టారు. వీటితో పాటు ఆయన స్వరపరిచిన కీర్తనల్లో దాశరథి శతకం పద్యాలు, రాగసుధారస, భద్రాచల రామదాసు కీర్తనలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. ఆల్ ఇండియా రేడియో భక్తిరంజని కార్యక్రమంలో ఈయన రూపొందించిన నారాయణ తీర్థ తరంగాలు, రామదాసు కీర్తనలు అలరించాయి. ఇవన్నీ సీడీలు, క్యాసెట్ల రూపంలో ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయి.



పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని సందర్శించిన నేదునూరి కృష్ణమూర్తి (ఫైల్ ఫొటో)

వివిధ హోదాల్లో...

నేదునూరి తొలుత విజయవాడ జీవీఆర్ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రధాన అధ్యాపకుడిగాను, తదనంతరం సికింద్రాబాద్, విజయనగరం, తిరుపతి సంగీత కళాశాలల్లో పనిచేశారు. వెంకటేశ్వర, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో ఆర్ట్స్ విభాగం డీన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఆల్‌ఇండియా రేడియో సంగీత విభాగం ఆడిషన్ బోర్డు సభ్యుడిగా వ్యవహరించారు. కొంతకాలం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గౌరవ ఆచార్యుడిగా ఉన్నారు. తాను వయొలిన్, సంగీతం నేర్చుకున్న విజయనగరం కళాశాలలోనే పనిచేయడం తనకు అత్యంత సంతృప్తి ఇచ్చిందని నేదునూరి చెప్పేవారు.

పురస్కారాల వెల్లువ

నేదునూరికి పలు పురస్కారాలు లభించాయి. 1976లో చెన్నైలోని శ్రీకృష్ణ గానసభ 'సంగీత చూడామణి' అవార్డుతో తొలుత సత్కరించింది. మద్రాసు మ్యూజిక్ అకాడమీ 1991లో 'సంగీత కళానిధి' పురస్కారంతో, 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళానీరాజన' పురస్కారంతో, చికాగోలోని నార్త్ అమెరికా అన్నమాచార్య ప్రాజెక్టు 'అన్నమాచార్య విద్వన్మణి, రాష్ట్ర సాంస్కృతిక సమాఖ్య 1999లో హంస అవార్డుతో సత్కరించాయి. 2002లో రాజ్యలక్ష్మి ఫౌండేషన్ ద్వారా రాజ్యలక్ష్మి అవార్డు, 2002లో అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్ బాదం మాధవరావు ద్వారా బాదం అప్పారావు మెమోరియల్ ట్రస్టు అవార్డు, 2010లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ పొందారు. అనారోగ్యానికి గురయ్యే వరకు ఆయన కీర్తనలను ఆలపించడమే కాదు స్వరపరుస్తూనే ఉన్నారు. 87 ఏళ్ల వయసులో 2014 డిసెంబరు 8న విశాఖపట్టణంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణించినా ఆ సుస్వరాలు నేటికీ అందరినోటా వినిపిస్తూనే ఉన్నాయి.

జన్మభూమిపై ఎనలేని మమకారం

నేదునూరి ఎక్కడకు వెళ్లినా పిఠాపురంపై మాత్రం మమకారం వీడలేదు. తనకు జన్మనిచ్చిన గడ్డపై అడుగుపెట్టేందుకు ఆయన తరచూ ప్రయత్నించేవారు. నేదునూరి కృష్ణమూర్తి చిన్నతనంలో ఈయన కుటుంబం పిఠాపురంలోని కోటవారి వీధిలో ఎక్కువ కాలం నివాసముంది. తదనంతరం ఆకొండి వారి వీధిలో ఉన్నారు. ఇప్పుడు వారు నివసించిన గృహాలు శిథిలమవ్వడంతో అక్కడ నూతన గృహాలు వెలిశాయి. అయినప్పటికీ ఆ వీధుల్లో నివసించే వృద్ధుల్లో పలువురికి నేదునూరితో అవినాభావ సంబంధాలు ఉండేవి.

పాదగయపై భక్తి భావం.. జన్మ స్థలం అమ్మఒడి

జీవితచరమాంకంలోనూ నేదునూరి పిఠాపురం పాదగయ క్షేత్రంపై తనకు ఉన్న భక్తిభావాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ మరణానికి నెలన్నర ముందు పాదగయను కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. పాదగయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందించారు. జన్మస్థలం అమ్మ ఒడి లాంటిదని, పిఠాపురంపై తనకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.




వెరీ గుడ్డు!

గుడ్డుతో పరిపూర్ణ ఆరోగ్యం
నేడు అంతర్జాతీయ గుడ్డు దినోత్సవం

అనపర్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే ఏకైక ఆహారం గుడ్డు అనడంలో ఎటువంటి సందేహం లేదు. పేదవారి నుంచి మధ్యతరగతి కుటుంబాల వరకు ఎన్నో రకాల వంటకాలు గుడ్డుతోనే తయారుచేస్తారు. గుడ్డును చౌకగా వచ్చే ఆహారంగానే చూస్తున్నాంగానీ దీని నుంచి లభించే పోషక విలువలు ఎంత ముఖ్యమో ఎంతమందికి తెలుసు. పూర్వం పల్లెల్లో ఇళ్ల వద్దే రైతులు కోళ్లను పెంచడం, తద్వారా వచ్చిన గుడ్లను కుటుంబంలోని సభ్యులు మాత్రమే తినడం, కొన్ని గుడ్లను బంధువులకు పంచడం జరిగేది. కాలక్రమంలో మిగిలిన గుడ్లను వారపు సంతలకు తరలించి విక్రయించడం ద్వారా గుడ్ల అమ్మకాలకు నాందిపలికారు. దేశంలో కోళ్ల పెంపకం ద్వారా గుడ్లను భారీస్థాయిలో ఉత్పత్తి చేయడం చేయడమేకాకుండా పట్టణాల్లో ఉండే వారికి సైతం గుడ్డును అందుబాటులోకి తీసుకురావాలనే బీవీ రావు కోళ్ల పరిశ్రమకు బీజం వేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. ప్రస్తుతం మన రాష్ట్రం నుంచే గుడ్లను దేశ, విదేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి పరిశ్రమ చేరుకుంది. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ గుడ్డు ఎగుమతిలో ప్రథమ స్థానంలో నిలవగా, రాష్ట్రానికి ఉమ్మడి తూర్పుగోదావరి కోళ్ల పరిశ్రమకు రాజధానిగా మారడం అందరికీ తెలిసిందే. రాష్ట్రంలోనే ఉత్పత్తి అయ్యే గుడ్లలో సుమారు 50 శాతం మేర ఉత్పత్తి జరగడం ఇక్కడ కోళ్ల పరిశ్రమకు లభిస్తున్న ఆదరణగా చెప్పవచ్చు. అయితే గుడ్ల ఉత్పత్తికి కేంద్రంగా ఉన్న ఉమ్మడి జిల్లాలో గుడ్ల వినియోగం తక్కువగా ఉందనే చెప్పవచ్చు. అయితే గుడ్డులో లభించే పోషక విలువలను ప్రజలకు వివరించి వాటి వినియోగాన్ని పెంచే దిశగా కోళ్ల రైతులు చేస్తున్న కృషి కొనసాగిస్తూనే ఉన్నారు. వాస్తవానికి అనపర్తి ప్రాంతంలో గుడ్ల ఎగుమతిని బట్టే నెక్ గుడ్డు రేటును ప్లస్, మైనస్‌లు చేసుకుంటాయనడంతో సందేహం లేదు. అంతటి కీలకమైన మన ప్రాంతంలో గుడ్ల వినియోగం మరింత పెరగాల్సి ఉంది. ఇక ప్రతి ఏడాది అక్టోబరు నెలలో 2వ శుక్రవారాన్ని నేషనల్ ఎగ్‌డేగా నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ ఎగ్ కమిషన్ 1996లో వియన్నాలో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో తొలిసారిగా ఈ ఎగ్ డేను జరుపుకోవాలని నిర్ణయించింది. విజయవాడలో నెక్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే ఇంటర్నేషనర్ ఎగ్ డేకు మన ప్రాంతం నుంచి పలువురు రైతులు తరలివెళుతున్నారు.

ప్రభుత్వం చేయూత

కోడిగుడ్డు ద్వారా కలిగే ప్రయోజనాలను గుర్తించిన ప్రభుత్వం అటు అంగన్వాడీల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, పాఠశాలల విద్యార్థులకు, వసతిగృహ విద్యార్థులకు గుడ్డును ఉచితంగా పంపిణీ చేస్తూ కోళ్ల పరిశ్రమకు తన వంతు చేయూతనందిస్తోంది. పౌష్టికాహారం అందించడం ద్వారా ప్రజలకు చాలా ప్రయోజనం చేకూరుస్తోంది.



కోళ్ల పరిశ్రమ ద్వారా వేలాది మందికి ఉపాధి

- పడాల సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీ, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్



జిల్లాలో కోళ్ల పరిశ్రమ ద్వారా అనేక కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం నుంచి తూర్పుగోదావరి జిల్లాలో గల కోళ్ల పరిశ్రమలకు కూలీలుగా వచ్చిన అనేక మంది ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అంతేకాకుండా ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అనేక కుటుంబాలకు జీవనోపాధి లభిస్తోంది. గుడ్డు విశిష్టతను తెలియజేస్తూ గుడ్డు వినియోగం పెరిగే విధంగా ప్రతి ఏటా అక్టోబరు 2వ శుక్రవారం అంతర్జాతీయ ఎగ్‌డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 2.40 కోట్ల గుడ్ల ఉత్పత్తి జరుగుతుండగా, వీటిలో 40 శాతం మేర ఇక్కడ వినియోగిస్తున్నారు.



పోషక విలువలు వెలకట్టలేం

డాక్టర్ తాడి రామగురెడ్డి, అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

- కూరగాయలు, పండ్లలో లేని విటమిన్ బి12, విటమిన్‌డి, ఫోలిక్ యాసిడ్ గుడ్డులో లభిస్తాయి. కాలుష్యం వల్ల ఏర్పడే దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు గుడ్డులోని పచ్చసొనలో ప్రత్యేకంగా కాపర్, జింక్, మాంగనీస్, సెలీనియమ్‌లు దోహదపడతాయి.
- మానసిన ఒత్తిడిని తగ్గించేందుకు గుడ్డులోని తెల్లసొనలో హిస్టోడిన్, జింక్, కోలిన్, అయోడిన్, లినోలిక్ యాసిడ్‌లు ఉపయోగపడతాయి.
- ఊబకాయులకు పచ్చసొనలో శరీర సౌష్టవాన్ని కాపాడే విటమిన్‌డి, కొవ్వును కరిగించే కోలిన్ అనే ధాతువు, సెలీనియమ్, బి12లు ఉపయోగపడతాయి.
- మధుమేహ వ్యాధిగ్రస్తులకు గుడ్డులోని తెల్లసొన ద్వారా లభించే ప్రొటీన్‌ప్యాంక్రిస్ ద్వారా గ్రంథిని నిర్మించి జింకు క్రోమీన్ ద్వారా ఇన్సులిన్ క్రియను కలుగజేసి ఎంతో ఉపయోగపడుతుంది.
- కంటిని రక్షించేందుకు గుడ్డులోని విటమిన్-ఏ ప్రధాన జీవపోషకంగా ఉపకరిస్తుంది.
- ఎముకల పటిష్టతకు గుడ్డులోని పచ్చసొనలో అధికంగా ఉండే కాల్షియం ఉపయోగపడుతుంది.

...ఇలా అన్ని రకాల అనారోగ్య సమస్యలకు గుడ్డు ఎంతో ఉపయోగపడడమే కాకుండా ఆరోగ్యవంతులకు ఎన్నో రకాల పోషక విలువలను అందిస్తుంది.

గుడ్డులో 96 శాతం కేలరీలు, విటమిన్ ఎ, డి, ఈ, కె. బి6, బి12 క్యాల్షియం, ఐరన్, జింకు, ఫోలైట్, ఫోలిక్ యాసిడ్, పాస్పరస్, పొటాషియం, క్లోరిన్, కాపర్, మెగ్నీషియం, సీలియమ్‌లతో పాటు అనేక రకాల విటమిన్లు లభిస్తాయి.



కోనసీమ తిరుమల వాడపల్లి బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. ఈ పుణ్యక్షేత్రం తొమ్మిది రోజుల పాటు వేద ఘోష, మంగళవాయిద్యాలతో పులకించనుంది. గ్రామానికి విచ్చేసే మార్గాలన్నీ స్వాగత ద్వారాలు, విద్యుద్దీపాలంకరణలతో వెలుగొందుతున్నాయి. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని వసంత, ముఖ మండపాలను ఫల, పుష్పాలు, వివిధ రాష్ట్రాలకు చెందిన వెరైటీ రంగుల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.



బ్రహ్మోత్సవ శోభ

- 13వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వాడపల్లి
- శ్రీవేంకటేశ్వరస్వామికి 9 రోజుల పాటు వాహన సేవలు
- తిరుమల తరహాలో విస్తృత ఏర్పాట్లు



ఆత్రేయపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి తిరుమల తరహాలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో యాగశాలను సిద్ధం చేశారు. రాష్ట్ర మంత్రులు, జిల్లా అధికారులు, ప్రముఖులకు శుభ పత్రికలను అందజేసి ఆహ్వానించారు. పట్టణాల నుంచి పల్లెల వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు ఎల్‌ఈడీలతో డిజిటల్ ప్రచారం చేశారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ వాహనాలపై శ్రీవారు తిరువీధుల్లో విహరించి భక్తులకు కృపాకటాక్షాలు అందించనున్నారు. శుక్రవారం రాత్రి పరావాసుదేవ అలంకరణతో శేషవాహన సేవ, 11వ తేదీ రాత్రి సరస్వతి అలంకరణతో హంస వాహన సేవ, 12న కోదండరామ అలంకరణతో హనుమత్ వాహన సేవ, 13న యోగనారసింహ అలంకరణతో సింహ వాహన సేవ, 14న మలయప్ప అలంకరణతో గరుడ వాహన సేవ, 15వ తేదీ ఉదయం శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ, రాత్రి మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ, 16న రాజాధిరాజ అలంకరణతో గజ వాహన సేవ, 17వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహన సేవ, రాత్రి కల్కి అలంకరణతో అశ్వవాహన సేవ జరుగుతాయి. 18న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

తొమ్మిది రోజుల పాటు మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులకు కనువిందు చేయనున్నారు.

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టామన్నారు.



కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఉప కమిషనరు సూర్యచక్రధరరావు



దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ దంపతులకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న దృశ్యం

ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు

ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్ననాయుడును కలిసి బ్రహోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ దంపతులను ఆహ్వానించి స్వామివారి చిత్రపటం అందజేశారు. విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ఈవో శీనా నాయక్‌కు కూడా ఆహ్వానం పలికారు.

అన్ని డిపోల నుంచి వాడపల్లికి ప్రత్యేక బస్సులు

రావులపాలెం డిపో మేనేజరు కుమార్



రావులపాలెం (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వాడపల్లికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ రావులపాలెం డిపో మేనేజరు వైవీవీఎస్ కుమార్ తెలిపారు. రావులపాలెం డిపో నుంచి 12, రామచంద్రపురం డిపో నుంచి 3, అమలాపురం డిపో నుంచి 4, రాజోలు డిపో నుంచి 4 బస్సులు వెళ్తాయన్నారు. రావులపాలెం డిపో నుంచి 12 బస్సులు 156 ట్రిప్పులు తిరిగేలా కార్యాచరణ రూపొందించామని కుమార్ చెప్పారు.



అట్ల తద్దోయ్ ఆర ట్లోయ్

గౌరీదేవికి భక్తి శ్రద్ధలతో మహిళల పూజలు



అంబాజీపేటలో ఉయ్యాల ఊగుతున్న మహిళ

అట్లతద్ది పండుగను మహిళలు గురువారం వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునే లేచి స్నానాలు చేసి అట్లతద్దోయ్... ఆరట్లోయ్ అంటూ సందడి చేశారు. వయో బేధం లేకుండా అందరూ గౌరీదేవిని పూజించారు. అమ్మాయిలు తమకు మంచి భర్త దొరకాలని, అమ్మలు తమ కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని.. అమ్మమ్మలు తమ జీవితం సాఫీగా సాగాలంటూ గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి పూజలు జరిపి ఊయాల లూగారు.



రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద బొట్టు పెట్టి తాంబూలం, వాయినం ఇస్తున్న మహిళ

సాయంత్రం మరలా గౌరీదేవికి పూజలు చేసి గోదావరి, నదీపాయల్లో దీపాలు, అర్ఘ్యాలు వదిలారు. అనంతరం ముత్తయిదువులు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.



ముమ్మిడివరంలో గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు



కాకినాడ జిల్లా సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో...

సత్యదేవుని సన్నిధిలో హరేకృష్ణ గ్లోబల్ టెంపుల్ ప్రతినిధులు



సత్యదేవుని దర్శనానంతరం సత్యగౌర చంద్ర దాస, హరేకృష్ణ గ్లోబల్ టెంపుల్ ప్రతినిధులు

అన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి గురువారం హరేకృష్ణ గ్లోబల్ టెంపుల్ ప్రతినిధులు, అక్షయపాత్ర ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రాంతీయ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస విచ్చేశారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈవో వీర్ల సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలవగా ఆయన అక్షయపాత్ర నిర్వహణ తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు.

మత్స్యకార సమస్యలు పరిష్కరిస్తాం

● మూడునెలల్లో అన్నీ సమసిపోతాయ్
● ఉప్పాడ మత్స్యకారులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 'మాటామంతీ'


సమావేశంలో మాట్లాడుతున్న పవన్

కాకినాడ/ కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ పరిసర ప్రాంత మత్స్యకారుల సమస్యలపై మూడునెలల్లో సమగ్ర పరిష్కారం చూపుతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. కలెక్టరేట్ వివేకానంద సమావేశహాలులో గురువారం ఆయన మత్స్యకారులతో మాటా-మంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యకార గ్రామాల పెద్దలు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలతో ముఖాముఖిగా వారి సమస్యలను తెలుసుకున్నారు.

● పరిశ్రమల వ్యర్థాలతో సముద్ర జలాల కలుషితం

ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్, మూలపేట తదితర మత్స్యకార గ్రామాల ప్రతినిధులు కె.రాంబాబు, కె.వెంకటరమణ, సీహెచ్ దావీదు, కొల్లి రాంబాబు, ప్రసాద్, సూరాడరాజు, ముమ్మిడి జాన్సన్, కొండా వెంకటరమణ, బడే విజయకుమార్, పైడిపల్లి రాజు, మత్స్యకార యువకులు మోసా దేవళ్లు, వంకా ఎఫేజు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సతీష్, మత్స్యకార మహిళ ఉమ్మిడి అమరేశ్వరి పరిశ్రమల వ్యర్థాలు, ప్రకృతి వైపరీత్యాలవల్ల మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పవన్‌కు వివరించారు. పరిశ్రమల వ్యర్థాలతో సముద్రజలాలు కాలుష్యమయ్యాయని, దీంతో ఉపాధికి నష్టం వాటిల్లుతోందని మత్స్యకారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మత్స్య సంపద నాశనం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ.. చాలా ఏళ్లుగా ఉన్న ఈ సమస్యను ఇవాళే ఎందుకు తెరమీదకు తెచ్చారని, అంత రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని, తమ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన మీ దృష్టికి తీసుకువెళ్తే సమస్య పరిష్కారమవుతుందనే ఉద్దేశంతో సముద్రజలాల కలుషిత విషయమై ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. సమస్యల పట్ల ఆవేదనతో తొందరపాటుగా ఆందోళనకు దిగినందుకు చింతిస్తున్నామని, ఉపముఖ్యమంత్రి పెద్ద మనసుతో తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

● పొల్యూషన్ ఆడిట్ చేపట్టండి..

ఉప్పాడ ప్రాంత మత్స్యకారులు తెలిపిన పారిశ్రామిక కాలుష్యంపై పొల్యూషన్ ఆడిట్ చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. వారంరోజుల్లోగా నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. వందరోజుల్లోగా ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని మత్స్యకార ప్రతినిధులకు ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమలు, మత్స్యశాఖ, పీసీబీ, పరిశ్రమల ప్రతినిధులు, మత్స్యకారులు, ఎన్జీఓలు, స్టేక్‌హోల్డర్స్ అందరినీ భాగస్వాములను చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు. కాలుష్యస్థాయిపై ప్రాథమిక నివేదిక అందజేయాలని రాష్ట్ర పీసీబీ మెంబర్ సెక్రటరీని కోరారు. నిర్మాణంలో ఉన్న హార్బర్ డిజైన్ లోపాలపై ఐఐటీ చెన్నై నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం మత్స్యకార బోట్లకు ముప్పు లేకుండా డిజైన్ కరెక్షన్ చేయిస్తానన్నారు. రాష్ట్ర, దేశ అభివృద్ధికి పరిశ్రమలు కూడా అవసరమని, ప్రజల జీవనోపాధికి విఘాతం, లోటు లేకుండా సమతుల్యం పాటించాలన్నారు. ఉప్పాడ బోట్ల ల్యాండింగ్ అంశంలో అంతర్వేది, మచిలీపట్నం ప్రాంత మత్స్యకారులు, ప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఓఎన్జీసీ తరహాలో పరిహారం అందించే అంశం పరిశ్రమలు, మత్స్య, కాలుష్య నియంత్రణ తదితర శాఖలతో ముడిపడిన మల్టీ డిపార్ట్‌మెంటల్ అంశమని ఆయాశాఖలను సమన్వయపరిచి నిర్ణయించాల్సి ఉందన్నారు.

● ఉప్పాడ తీర రక్షణకు ఢిల్లీ వెళతా..

అలల కోత నుంచి ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు అవసరమైన రూ.320 కోట్ల నిధులు కేంద్ర హోంశాఖ నుంచి విడుదలయ్యేలా తానే స్వయంగా ఢిల్లీ వెళ్లి హోంమంత్రి అమిత్‌షాను కలుస్తానన్నారు. వచ్చే రెండు, మూడు ఏళ్లల్లో ఈ పనులు పూర్తి చేసేలా కృషి చేస్తానని తెలిపారు.

● పరిహారం చెక్కుల పంపిణీ

సముద్రవేటలో ప్రమాదవశాత్తూ మరణించిన 18 మంది మత్స్యకార కుటుంబాలకు గ్రూపు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద తొలివిడతగా ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.90లక్షల ఎక్స్‌గ్రేషియా మొత్తాల చెక్కులను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంపిణీ చేశారు.


కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకార ప్రతినిధులు

17న కేశనపల్లిలో పవన్ కల్యాణ్ పర్యటన

రాజోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం శంకరగుప్తం డ్రైన్ ముంపు వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ఈనెల 17 వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కేశనపల్లి రానున్నారని రాజోలు ఎమ్మెల్యే దేవా వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా రాజోలులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు రైతులు, బాధితులతో మాట్లాడతారని పేర్కొన్నారు. అలాగే పొదలాడ పంచాయతీ కార్యాలయంలో కూటమి నాయకులు, అధికారులతో పవన్ పర్యటనపై చర్చించారు. పొదలాడలో జాతీయ రహదారి 216 పక్కన ఉన్న పొదలాడ సెంటర్ నుంచి గ్రామపంచాయితీ కార్యాలయం వరకు ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 50 లక్షలతో కిలోమీటరు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పవన్ ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. చాగంటి స్వామి, సర్పంచ్ కడలి సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళా దొంగల అరెస్ట్

చోరీ సొత్తు స్వాధీనం

రాజమహేంద్రవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీసులు ఇద్దరు మహిళా దొంగలను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీఐ శివ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6న దేవరపల్లి మండలం యర్నగూడేనికి చెందిన జాగాని నాగమాధవి తన భర్త, పిల్లలతో కలిసి రాజమండ్రి రావడానికి ఆటో ఎక్కారు. కావవరం సమీపంలో ఇద్దరు మహిళలు అదే ఆటో ఎక్కి, ప్రయాణంలో సీటు జాగా సరిపోవడం లేదంటూ మాధవి దృష్టి మరల్చారు. ఆ ఇద్దరు మహిళలు కోటిపల్లి బస్టాండ్ వద్ద ఆటో దిగిపోయారు. రైల్వే స్టేషన్ సమీపంలో మాధవి తన హ్యాండ్ బ్యాగ్ చూసుకోగా జిప్ ఓపెన్ చేసి ఉంది. బ్యాగులో ఉంచిన బంగారు ఆభరణాల ప్లాస్టిక్ బాక్స్ కనిపించలేదు.దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో గోకవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన ఆవుల భూలక్ష్మి, నాగెల్లి దుర్గను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామని సీఐ చెప్పారు. వాళ్ల వద్ద నుంచి 70గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఎలక్ట్రీషియన్ మృతి


ట్రాక్టర్ ఢీకొని మృతిచెందిన పవన్ తేజ

పిఠాపురం రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.తిమ్మాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామానికి చెందిన కాదులూరి పవన్‌తేజ(27) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం యర్రవరం నుంచి కాకినాడకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. పి.తిమ్మాపురం గ్రామం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో పవన్‌తేజ ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిఠాపురంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పిఠాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి (45)గురువారం సాయంత్రం మృతి చెందాడు. కాలనీ పరిసర ప్రాంతాల్లో చెత్తకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే వ్యక్తికి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చాయి. పాత ఎక్సైజు స్టేషన్ వద్ద కుప్పకూలిపోయాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అతడిని పరీక్షించి చనిపోయినట్టు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదని తెలిపారు.

'రాయవరం' బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

● రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మృతదేహాలు పరిశీలించిన మంత్రి సుభాష్
● పేలుడు ఘటనలో ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య
● బాణసంచా తయారీ కేంద్రాల్లో విస్తృత తనిఖీలకు ఆదేశాలు


మృతుల బంధువులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బుధవారం జరిగిన బాణసంచా విస్ఫోటనం ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలోని మృతదేహాలను ఆయన పరిశీలించారు. పేలుడు ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరుకోవడంపై విచారం వ్యక్తం చేశారు. అనంతరం మృతుల కుటుంబీకులతో మాట్లాడి ఓదార్చారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ప్రవీణ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ బాణాసంచా కేంద్రం వద్ద శాంపిల్స్ సేకరించి విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించామన్నారు. తయారీకి సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రమాదం జరగడం, యజమానితో సహా ఎనిమిది మంది మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఈయన వెంటపాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు వుండవిల్లి శివ, మున్సిపల్ మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● పేలుడుపై దర్యాప్తునకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీ

బాణసంచా పేలుడుకు సంబంధించి నిజానిజాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. మునిసిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ నేతృత్వంలో దర్యాప్తు జరగనుంది. ఇందులో కమిటీ సభ్యుడిగా ఐజీ ఆకే రవికృష్ణను ఉన్నారు. ఈ దుర్ఘటనకు బాధ్యులెవరో తేల్చాలని పేర్కొంది. కమిటీకి సహకరించాలని కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనాకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏడు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

పేలుడు ఘటనలో అసువులు బాసిన ఏడుగురి మృతదేహాలకు గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.ప్రవీణ్,ఆర్ఎంవో డా. చక్రధర్ పర్యవేక్షణలో ఆసుపత్రి వైద్యులు, మండపేట ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగింది. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ ఎం.వెంకట నారాయణ, మండపేట రూరల్ సీఐ దొరరాజు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన విజయలక్ష్మి


విజయలక్ష్మి (ఫైల్)

జీజీహెచ్ (కాకినాడ)/ రాయవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) కొమరిపాలెం బాణసంచా విస్ఫోటనంలో తీవ్ర గాయాలపాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి మృత్యువుతో పోరాడి బుధవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచింది. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన వాసంశెట్టి విజయలక్ష్మి (45) కు భర్త వెంకట్రావు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఏడాది కాలంగా కొమరిపాలెం శివారు ప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో తన కుమార్తె దుర్గతో పాటు వెళ్లి బాణసంచా కార్మికులుగా పని చేస్తున్నారు.

నమూనాలు సేకరించిన ఫోరెన్సిక్ ల్యాబ్ సిబ్బంది

● సంఘటనా స్థలం నుంచి మందుగుండు సేకరణ

మండపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలో బుధవారం బాణసంచా దుకాణంలో జరిగిన పేలుడు సంఘటనపై విజయవాడకు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్‌సభ్యులు, స్థానిక పోలీస్ క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని శాంపిల్స్‌ను సేకరించారు. అసలు ప్రమాదం ఎలా జరిగింది, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా? అనే అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి పేలిన ప్రదేశం నుంచి కాలిబూడిదైన మందుగుండు సామగ్రిని శాంపిల్స్ నిమిత్తం విజయవాడ ల్యాబ్‌కు తీసుకువెళ్లారు. కాగా, ముడిసరుకుతో తయారు చేసే చిచ్చుబుడ్లు, మతాబులు, టపాసులు, తారాజువ్వలు వంటివి తయారు చేసే సమయంలో మందును దట్టించే సమయంలో పేలుడు సంభవించవచ్చని ఫైర్ నిపుణులు చెబుతున్నారు. మొత్తమ్మీద ఏది ఏమైనప్పటికీ రాయవరంలో జరిగిన విస్ఫోటనం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రంగా కలచివేసింది.

పిడుగుపాటుకు వ్యాపారవేత్త మృతి

● కాకినాడకు చెందిన వాసిగా గుర్తింపు


మృతిచెందిన కొవ్వూరు వెంకట రామకృష్ణా రెడ్డి

చేజర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో కాకినాడలో వ్యాపారవేత్తగా రాణిస్తూ వ్యవసాయం మీద మక్కువతో నెల్లూరు జిల్లా చేజర్ల మండలం చేజర్ల కండ్రిక సమీపంలో పొలం తీసుకుని పనులు చేయిస్తుండగా పిడుగుపాటుకు గురై మృతిచెందిన సంఘటన స్థానికులను కలచివేసింది. పూర్తి వివరాల మేరకు ... కాకినాడలో బిల్డర్ కాంట్రాక్టర్‌గా రాణిస్తున్న కొవ్వూరు వెంకట రామకృష్ణారెడ్డి (60) వ్యవసాయం చేయాలన్న ఉద్దేశంతో చేజర్ల సమీపంలో కొంతకాలం క్రితం పొలాన్ని తీసుకున్నాడు. రెండునెలల నుంచి అక్కడే ఉంటూ పొలంలో రోడ్లు, తదితర పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం కూలీల చేత పనులు చేయిస్తుండగా ఒక్కసారిగా మారిన వాతావరణంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, మృతుడు వెంకటరామ కృష్ణారెడ్డి చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో మమేకమై అందరితో కలిసిపోయేవాడని, ఇంతలోనే ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు నెల్లూరుకు బయలుదేరినట్లు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటరామ కృష్ణారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాణసంచా పేలిన ఘటనలో..

● చికిత్స పొందుతూ పురోహితుడు మృతి

పి.గన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఊరేగింపులో ప్రమాదవశాత్తు బాణసంచా (జువ్వలు) పేలి గాయాలపాలైన ఇద్దరు పురోహితుల్లో ఒకరు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పి.గన్నవరం మండలం మానేపల్లిలో ఈనెల 4వ తేదీ రాత్రి జరిగిన అమ్మవారి ఊరేగింపుల్లో సేవలో ఉన్న పురోహితులు వెలవలపల్లి విజయ ప్రసాద్ (55), పెద్దింటి రామరత్నగోపాల్ (35)కు ప్రమాదవశాత్తు బాణసంచా (జువ్వలు) పేలడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇద్దరు పురోహితుల్ని అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వారిలో విజయప్రసాద్ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం 4.30 సమయంలో మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీ.శివకృష్ణ తెలిపారు.

అనుమతుల్లేని మందుగుండు సామగ్రి సీజ్

కడియపులంకలో రూ.2,51,600 విలువైన క్రాకర్స్ స్వాధీనం


కడియపులంకలో పోలీసులు పట్టుకున్న మందుగుండు సామగ్రి

కడియం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అనుమతులు, లైసెన్సులు లేకుండా ఫైర్ క్రాకర్స్ స్టాక్ పాయింట్లను పోలీసులు గుర్తించారు. సీఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎటు వంటి అనుమతులు లేకుండా కడియపులంకలో బలభద్రుని నాగవీరసూర్యప్రకాష్ ఇంటిలో రూ.1,25,000 విలువైన క్రాకర్స్, గ్రంధి శ్రీరామచంద్రమూర్తికి చెందిన షాపులో రూ.21,600 విలువైన క్రాకర్స్, గెల్లి వెంకటేశ్వరరావు ఇంటిలో రూ.1,05,000 విలువైన క్రాకర్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు తెలిపారు. వీరిపై విడివిడిగా మూడు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ధనలక్ష్మి, స్పెషల్ బ్రాంచి హెడ్ కానిస్టేబుల్ జనార్ధనరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా క్రాకర్స్ ఉంచరాదని, అలా ఉంచితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, గుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంధకం, పటాస్ నిల్వలు సీజ్

కొత్తపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీకి ఉపయోగించే అక్రమంగా నిల్వ ఉంచిన గంధకం, పటాస్, క్లోరైడ్‌లను కొత్తపేట పోలీసులు సీజ్ చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసిన్నట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. కొత్తపేట ఆర్ఎస్ నగర్‌లో యర్రంశెట్టి మురళీకృష్ణకు చెందిన ఇంట్లో ఎక్స్‌ప్లోజివ్స్ నిల్వ చేసినట్టు వచ్చిన సమాచారం మేరకు రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.సురేంద్ర దాడి చేశారు. ఈ మేరకు 200 కిలోల ఎక్స్‌ప్లోజివ్‌ను సీజ్ చేశామని, వాటి విలువ సుమారుగా రూ.1,04,730 ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

జొన్నాడలో అనధికార స్టోన్ క్రషర్ సీజ్


అనధికారికంగా ఉన్న క్రషరును సీజ్ చేస్తున్న అధికారులు

ఆలమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గోదావరి ఒడ్డున అనధికారికంగా ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్‌ను గురువారం అధికారులు సీజ్ చేశారు. ఇక్కడ కొంతకాలంగా జరుగుతున్న స్టోన్ క్రషింగ్ రైతులకు ఇబ్బందికరంగా మారడంతో పలువురు రైతులు స్థానిక అధికారులతోపాటు కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో క్రషర్‌ను సీజ్ చేయాలని గత నెల 29న నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ క్రషర్‌ను నిర్వహింస్తుండడంతో రైతులు చేసిన ఫిర్యాదుతో ఎంపీడీవో ఎ.రాజు ఆదేశాల మేరకు మండల పరిషత్ ఏవో ఎం.మోహర్‌ప్రకాష్, జొన్నాడ కార్య దర్శి సీహెచ్.వీరమాత, పోలీసులు, సిబ్బందితో వెళ్లి నోటీసులు అంటించి సీజ్ చేశారు. అనుమతులు లేనిదే ఎటువంటి క్రషింగ్ చేయడానికి వీలు లేదని వారు హెచ్చరించారు.

జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు మేఘన ఎంపిక


మేఘనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముమ్మిడివరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఇటీవల జరిగిన అంతర్ జిల్లాల బాలుర, బాలికల షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ముమ్మిడివరం మండలం కొత్తలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గెద్దాడ మేఘన ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. నవంబరు 7 నుంచి 9వరకు ఉత్తరప్రదేశ్ హెచ్ఆర్ఐటీ యూనివర్శిటీలో జరిగే జూనియర్ నేషనల్ షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని పీడీ కొప్పిశెట్టి సుజాత తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన మేఘనను విద్యాకమిటీ చైర్మన్ జైన్ బాబ్జి, హెచ్ఎం గోవర్ధనగిరిరావు, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న 14 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్

» కోరంగి చేయూత మార్ట్‌లో రూ.15.80 లక్షల దుర్వినియోగం
» ఇద్దరు ఏపీఎంలు, మరో ఇద్దరు కమ్యూనిటీ కోఆర్డినేటర్లపై వేటు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో గొల్లప్రోలు ఏపీఎం సన్యాసిరావు, తాళ్లరేవు ఇన్‌చార్జి ఏపీఎంగా పనిచేసిన విష్ణు, మరో ఇద్దరు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు (సీసీలు) ఉన్నారు. మండలంలోని కోరంగిలో ఉన్న చేయూత మార్ట్‌లో రూ.15.80 లక్షలు నిధులు దుర్వినియోగం అవ్వడంతో వీరిపై వేటు వేశారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చేయూత మార్ట్‌ను డ్వాక్రా సభ్యుల ఆర్థిక ఉన్నతి కోసం స్థాపించారు. దీని స్థాపన కోసం మండలంలో ఉన్న ఒక్కొక్క డ్వాక్రా గ్రూపు నుంచి వేలాది రూపాయలు పెట్టుబడి కింద సేకరించారు. మార్ట్‌లో నిత్యావసర వస్తువులను విక్రయించేవారు.వాటి ద్వారా వచ్చిన ఆదాయంలో లాభాలను డ్వాక్రా సంఘాలకు పంపిణీ చేస్తామని నమ్మబలికారు. తీరా వస్తువులు విక్రయించగా వచ్చిన సొమ్ములను సంబంధిత బ్యాంకు ఖాతాకు జమ చేయకుండా దుర్వినియోగం చేసినట్టు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఇద్దరు ఏపీఎంలు, మరో ఇద్దరు సీసీలను సస్పెండ్ చేశారు. అయితే గతంలో తాళ్లరేవులో పనిచేసిన ఏపీఎం విష్ణు ఇప్పుడు కోనసీమ జిల్లా మండపేటలో విధుల్లో ఉన్నారు. ఈ క్రమంలో విష్ణును సస్పెండ్ చేయాలని ఆ జిల్లా డీఆర్‌డీఏ పీడీకి కాకినాడ జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఒక ఉత్తర్వును పంపించారు. కాగా కాకినాడ డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు గురువారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సొమ్ములు దుర్వినియోగం చేసిన నలుగురిని సస్పెండ్ చేశామన్నారు. ఏపీఎం విష్ణు మండపేటలో విధుల్లో ఉండటం వల్ల ఆయన్ని సస్పెండ్ చేయాలని కోనసీమ డీఆర్‌డీఏ పీడీని కోరామన్నారు.

జీజీహెచ్‌లో ముగ్గురిపై వేటు

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో రోగుల నుంచి లంచం తీసుకుంటున్నారనే అవినీతి ఆరోపణల ఎదుర్కొంటున్న ఇద్దరు ఎఫ్ఎన్‌వోలు, ఒక ఎంఎన్‌వోను సస్పెండ్ చేస్తూ వైద్యాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో రెగ్యులర్ ఎఫ్ఎన్‌వో జె.వరలక్ష్మి, అవుట్ సోర్సింగ్ ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు సువర్ణశ్రీ, అచ్యుత్‌కుమార్ ఉన్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఉద్యోగి డి.అన్నపూర్ణను తొలగించాలని కాంట్రాక్ట్ సంస్థకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నలుగురు గైనిక్ ఆపరేషన్ థియేటర్(జీవోటీ)లో పని చేస్తున్నారు.

నేడు, రేపు డిస్ట్రిక్ట్ ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ సేల్ అండ్ ఎక్స్‌పో

రాజమహేంద్రవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల అమలులోకి వచ్చిన జీఎస్టీ 2.0 విధానం వల్ల వివిధ వస్తువులపై తగ్గిన పన్ను రేట్లపై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి శుక్ర, శనివారాల్లో డిస్ట్రిక్ట్ ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ సేల్ అండ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్టు రాజమహేంద్రవరం (తూర్పు, కోనసీమ జిల్లాల) జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎం.సుధాకర్ తెలిపారు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీహాల్‌లో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ నినాదంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు, ఇతర ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు.నగరంలోని సాధారణ ప్రజానీకం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, తగ్గిన ధరలను తెలుసుకోవాలని ఆయన కోరారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో సాహితికి కాంస్యం

జేఎన్టీయూకే, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకే ఏఐఎంఎల్ విద్యార్థిని కె.సింధూర సాహితి 8వ అంతర జిల్లాల షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ పోటీలు సెప్టెంబరు 25, 26 తేదీల్లో కర్నూల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థిని వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, డైరెక్టర్ కృష్ణమోహన్ అభినందించారు.

అమలాపురం


చల్లపల్లిలో తనిఖీ చేస్తున్న పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులు


వాడ్రేవుపల్లిలో పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీపల్లవి, ఎస్ఐ శివకృష్ణ

మూడు రోజులపాటు

బాణసంచా తయారీ నిలిపివేయండి

● అగ్నిమాపక జిల్లా అధికారి పార్థసారథి

ఉప్పలగుప్తం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు బాణసంచా తయారీని నిలిపి వెయ్యాలని మేరీ ఫైర్ వర్క్స్ యజమానిని అధికారులు ఆదేశించారు. చల్లపల్లి మేరీ ఫైర్‌వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రాన్ని గురువారం జిల్లా అగ్నిమాపక అధికారి పార్థసారథి, అమాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, ఆర్డీవో కె.మాధవి తనిఖీ చేశారు. ఫైర్‌వర్క్స్ లైసెన్సు రన్నింగ్‌లో ఉన్నట్టు గుర్తించారు. అయితే మూడు రోజుల పాటు కేంద్రాన్ని మూసివెయ్యాలని యజమానికి చెప్పారు. తహసీల్దార్ వాసా దివాకర్, అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ రాజేష్ పాల్గొన్నారు.

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి): జిల్లా లో జరిగిన రెండు బాణాసంచా ప్రమాదాల నేపథ్యంలో అనుమతులు ఉన్నప్పటికీ ఈనెల 11వ తేదీవరకు ఎటువంటి బాణాసంచా తయారీకానీ, విక్రయాలుకానీ చేయరాదని తహశీల్దార్ పి.శ్రీపల్లవి సూచించారు. వాడ్రేవుపల్లి గ్రామంలో బాణాసంచా తయారీ కేంద్రాన్ని స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. బాణాసంచా తయారీ కేంద్రాలలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాడ్రేవుపల్లిలో ఉన్న తయారీ కేంద్రానికి ప్రస్తుతం లైసెన్స్ గడువు ముగిసిందని లైసెన్సను రెన్యూవల్ చేసుకోవాలని సూచించా రు. ఈనెల 11వ తేదీ తరువాత జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తయారీదారులకు అవగాహన అనంతరం లైసెన్స్ ఉన్న వాటికి అనుమతులు ఇస్తామన్నారు. అదే విధంగా కె.ముంజవరం శివారు కఠార్లంకలో కూడా పరిశీలించామని అక్కడ టపాకాయలు తయారుచేసే కేంద్రాలు ఉన్నట్లు తెలిసి ందన్నారు. వాటిని కూడా పూర్తిస్థాయిలో పరిశీలిస్తామన్నారు. తహశీల్దార్ వెంట ఎస్ఐ బి.శివకృష్ణ, ఆర్ఐ డాంఘే, వీఆర్వో శివరామకృష్ణ, ఫైర్ సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా నిల్వచేసిన బాణసంచా సీజ్

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా అక్రమంగా బాణసంచాను నిల్వచేసిన ఓ ఇంటిపై ముమ్మిడివరం పోలీసులు గురువారం దాడిచేసి రూ.30 వేల విలువైన బాణసంచాను సీజ్ చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెంలో జగతా వెంకటకుమారస్వామి ఇంట్లో అక్రమంగా బాణసంచాను నిల్వచేసినట్లు పోలీసులకు సమాచారం అందడంతో గురువారం ఆ ఇంటిపై దాడిచేసి నిల్వఉంచిన రూ.30వేల విలువగల బాణాసంచాను సీజ్ చేశారు. జగతా వెంకటకుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో అక్రమంగా నిల్వఉంచిన బాణసంచా గోదాములపై గురువారం ఉదయం నుంచి దాడులు నిర్వహించారు. ఎవరైనా బాణసంచాను అక్రమంగా నిల్వచేస్తే మందు గుండు సామగ్రిని సీజ్ చేసి వాటిని నిల్వచేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

బాణసంచా నిల్వలపై పోలీసుల దాడి

అల్లవరం(ఆంధ్రజ్యోతి): రాయవరం మండలంలోని కొమరిపాలెంలో బాణాసంచా పేలుడు నేపథ్యంలో అల్లవరం పోలీసులు బాణాసంచా మందును దాడిచేసి పట్టుకున్నారు. రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అధ్వర్యంలో అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ గురువారం పలు ప్రాంతాలలో సోదాలు నిర్వహించారు. అల్లవరంలో మతాబి మందు నిల్వలు, గూడాలలో తారాజువ్వల మందులను పట్టుకున్నామని ఈమేరకు కేసులు నమోదు చేస్తామన్నారు.


ఒడరేవు బీవీసీ కళాశాలలో మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీం బాషా

సహ పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవాలి

● డీఈవో షేక్ సలీం బాషా

అల్లవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సహపాఠ్య అంశాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీంబాషా అన్నారు. ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించారు. మెగా డీఎస్సీలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు వారి సబ్జెక్టు అంశాలపై అవగాహన అవసరమన్నారు. విధులలోకి చేరిన ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్య అంశాల బోధనతోపాటు ప్రభుత్వ పరంగా అందించే ప్రోత్సాహకాలు వివరించాలన్నారు. శిక్షణ జరుగుతున్న తీరు పట్ల, ఉపాధ్యాయులు తయారు చేసిన పీఎల్ఎంలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో పి.రాంబాబు మాట్లాడుతూ గణితం, ఫిజిక్స్, బయోలజీ సబ్జెక్టులకు 204మంది శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల వెబ్ అప్షన్స్ నమోదు చేసుకున్నారు. శుక్రవారం శిక్షణ పూర్తవుతుందన్నారు. ఎంఈవోలు, వెంకటేశ్వరరావు, వైవీవీ.సత్యనారాయణ, కె.శ్యామ్యేలు, పి.పల్లయ్యశర్మలు పాల్గొన్నారు.

'పేదలకు వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం'


రాజోలులో దయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవా వరప్రసాద్

రాజోలు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని రాజోలు ఎమ్మెల్యే దేవా వరప్రసాద్ అన్నారు. రాజోలు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డయాల్‌సిస్ కేంద్రంలో కిడ్నీ బాధితులసౌకర్యార్థం నిర్వహిస్తున్న డయాల్‌సిస్ కేంద్రంనందు అదనంగా ఏర్పాటు చేసిన రెండు డయాల్‌సిస్ యూనిట్‌లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందన్నారు. 55మంది డయా ల్‌సిస్ బాధితులు ఈకేంద్రంలో డయాల్‌సిస్ చేయించుకుంటున్నారని ఆయన అన్నారు. సీహెచ్‌సీలో గైనకాలజిస్ట్ అందు బాటులో లేకపోవడం వలన మహిళలు అవస్థలు పడుతున్నారని త్వరలో ఈసమస్యను పరిష్కరించాలని ఆయన ఉన్నతాధికారులకు సూచించారు. అనంతరం సూపర్ జీఎస్టీ సూపర్‌సేవింగ్స్ ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మెడిసిన్ భీమా వంటి జీఎస్టీ వైద్య విభాగాలలో తగ్గించడం వలన పేద ప్రజలకు ఆర్థిక భారం తగ్గనుందని తెలిపారు. మెడిసిన్ భీమా వంటి ఆరోగ్య సేవలను మరింత మెరుగ్గా పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య, ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, ఎంపీపీ కడలి శ్రీదుర్గా, బందెల పద్మ, డీఎంహెచ్‌వో డి.దుర్గారావు దొర, డీపీఎంవో డాక్టర్ టీకే శ్రీనివాస్, జిల్లా కమ్యూనిటీ హెల్త్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కార్తీక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ మరింత సులభం

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి): ఔషధాలు, వైద్య పరికరాలపై ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ రేట్లు తగ్గించిందని ఇకపై ఆరోగ్య సంరక్షణ సులభతరమని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు స్పష్టం చేశారు. సీహెచ్‌సీలో గురువారం స్థానిక మెడికల్ షాపుల నిర్వాహ కులతో ఏర్పాటుచేసిన అవగహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మందుల రేట్లు తగ్గడంతో రోగులకు కాస్త ఆర్థికభారం తగ్గుతుందని ఆయన అన్నారు. గతంలో 33రకాల లైఫ్ సేవింగ్స్ డ్రగ్స్‌కు జీఎస్టీ 12శాతం ఉండేదని ప్రస్తుతం 0 శాతంగాను, డ్రగ్స్ అండ్ మెడిసిన్స్ 12 శాతం ఉండగా ప్రస్తుతం 5శాతం తగ్గిందని, వైద్య పరికరాలు 12 శాతం ఉండగా 5 శాతంకు తగ్గిందన్నారు. తగ్గిన ధరలకు మాత్రమే వినియోగదారులకు మందులను విక్రయిస్తూ అవగహన కల్పించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో మెడికల్ షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో గురువారం వైద్య, ఆరోగ్యశాఖ అధ్వర్యంలో జీఎస్టీలో ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలపై అవగాహన కల్పించా రు. జీఎస్టీ సంస్కరణలవల్ల మందులపై తగ్గిన పన్నుల వల్ల ప్రజలకు ఎంతమేర ప్రయోజనం కలుగుతుందనే విషయా న్ని ప్రజలకు వివరించారు.

ప్రాణరక్షణ మందులపై జీఎస్టీ తొలగింపు

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి): ప్రాణరక్షణ మందులపై జీఎస్టీ పూర్తిగా తొలగించి ప్రభుత్వం పేదలకు ఎంతో మేలు చేసిందని తహసీల్దార్ వాసా దివాకర్, ఎంపీడీవో డి.కృష్ణ అన్నారు. ఆరోగ్యబీమా, జీవితబీమాపై కూడా జీఎస్టీ తొలగించిందన్నారు. ఉప్పలగుప్తం పీహెచ్‌సీ వద్ద గురువారం సీహెచ్‌వో విజయలక్ష్మి అధ్యక్షతన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం జరిగింది. రోగులకు జీఎస్టీ సంస్కరణల ఫలితాలను ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సన్నవిల్లి సర్పంచ్ చిక్కం జంగమయ్య, మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, గొల్లవిల్లి మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ, హెచ్ఎస్ జీ.నరసింహమూర్తి, హెచ్‌వి కమల పాల్గొన్నారు.

బోధనేతర పనులు, విద్యాశక్తిని బహిష్కరిస్తాం

● అధికారులకు వినతిపత్రం అందించిన ఫ్యాప్టో ఉపాధ్యాయ నాయకులు


పి.గన్నవరం మండల విద్యాశాఖ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

పి.గన్నవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఈనెల 10వ తేదీ నుంచి బోధనే తర పనులు, విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్క రిస్తున్నామని ఫ్యాప్టో(ఏపీ ఉపాధ్యాయ సంఘా ల సమాఖ్య) సంఘ నాయకులు ప్రకటించారు. ఈమేరకు గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలకు వినతిపత్రం అందించారు. ఈనెల 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన పోరుబాట కార్యక్రమంలో బోధనేతర పనులను 10వ తేదీ నుంచి బహిష్కరించాలని, బోధనకే పరిమితమైన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ నిర్ణయించిం దని వారు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంనకు సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారని, మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణతప్ప ఇక ఏవిధమైనవి చేపట్టబోమని స్పష్టం చేశారు. అనంతరం ఫ్యాప్టో సంఘ నాయకులు ఎంఈవోలు కె.హెలీనా, సీహెచ్ వీరభద్రానందంకు వినతిపత్రం అందించారు.నల్లా బాలాజీ, దూనబో యిన రామకృష్ణ, నీతిపూడి శ్రీనివాస్, గిడ్ల శ్రీనివాస్, వరిగేటి రత్నం, కాపవరపు గోపాల కృష్ణ పాల్గొన్నారు.

బోధనేతర పనులు బహిష్కరిస్తాం

మామిడికుదురు (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనులు పెరిగిపోయాయని అందు వల్ల బోధనేతర పనులు, విద్యశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తామని తెలియజేస్తు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమైఖ్య గురువారం ఎంఈవో లక్ష్మీనారాయణ, వెంకన్నబాబులకు వినతిపత్రం అందించారు. బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోతున్నాయని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని, అక్టోబరు 7వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగిన పోరుబాట కార్యక్రమంలో ఈనెల 10వ తేదీ నుంచి బోధనే తర పనులను బహిష్కరించడానికి నిర్ణయించి నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో చెల్లిబోయిన కేశవరావు, మట్టా నాగరాజు, కారుపల్లి కళ్యాణ్‌బాబు, బాలం పెద్దిరాజు, తోట రాజరావు, ఎం.హాస్సే న్, కె.వీరరాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 10 నుంచి ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలను విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల సమైఖ్య పేర్కొంది. సమైఖ్య నాయకులు గురువారం ముమ్మిడివరంలో మండల విద్యాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సమైఖ్య నాయకులు ఎస్.ఎస్. మునేశ్వరరావు, పి.హిమ బిందు, శిలారపు శ్రీనువాసరావు, రెడ్డి నాగార్జున రావు, పి.సత్యన్నారాయణ, పి.పార్థు, యు.దశరదరామయ్యలతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఈనెల 11న విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహిస్తున్న విజ్ఞాపన సభను విజయవంతం చేయాలని ఎంపీఎస్ ఉపాధ్యాయ సంఘం పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి సమస్యలను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈసభను నిర్వహిస్తున్నట్లు ఆసంఘ సభ్యులు తెలిపారు. రాష్ట్రంలో 4072మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఎన్నోఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని రెగ్యులర్ ఉపాధ్యాయులకు సమాంతరంగా ఏవిధమైన భద్రత లేకుండా అతితక్కువ జీతానికి పనిచేస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈఆందోళనకు ఎంటీఎస్ ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. పీటీటీ.వర్మ, పీడీ.కృష్ణవర్మ, పి.వెంకటేశ్వరరావు, టి.నాగేశ్వరరావు, పి.శ్రీనివాస వర్మ, పి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అట్లతద్ది


అంబాజీపేట: పంటకాలువ వద్ద మహిళలు పూజలు

ముమ్మిడివరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అట్లతద్ది వేడుకను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి పేరంటాలతో కలిసి భోజనాలు ఆరగించి సాయంత్రం వరకు ఉపవాసాన్ని ఆచరించి కాల్వల వద్ద గౌరీదేవికి పూజలు చేశారు. ముత యిదువులకు అరటిపళ్లు, అట్లు, పండ్లతో వాయినాలు అందించి గోపూజ నిర్వహించారు. అనంతరం చంద్రుడిని దర్శించుకుని అల్పాహారం స్వీకరించారు. గ్రామాల్లో అట్లతద్ది చేసే యువతులతో సందడి చోటుచేసుకుంది.

అట్లతద్దోయ్..ఆరట్లోయ్..

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): అట్లతద్దోయ్... ఆరట్లోయ్ అంటూ వేకువ జామునే మహిళలు లేచి గురువారం వైభవంగా అట్లతద్దిని జరుపుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి పూజలను చేశారు. సాయంత్రం మరలా గౌరీదేవికి పూజలను నిర్వహించి గోదావరి, నదీపాయలలో దీపాలు, అర్ఘ్యాలు వదిలారు. అనంత రం ముత్తైదవులు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గోపూజలను నిర్వహించారు.

న్యాయవాదుల రిలే దీక్షలు

ముమ్మిడివరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సుప్రీమ్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ ముమ్మిడివరంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. జూనియర్ సివిల్ కోర్టు ఎదుట బార్ అసోసియేషన్‌వద్ద శిబిరాన్ని ఏర్పాటుచేసి మూడో రోజుకూడా విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, కాశీబాబు జగ్జీవన్‌రావు, రేవు శాస్త్రి, దోణిపాటి అంజనేయులు, పీవీ.చక్రవర్తి, కోనమండ వెంకటేశ్వరరావు, అయినవిల్లి వలియాబాబు, ముదె వెంకట్రావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

రాకేష్‌కిషోర్ చిత్రపటం దహనం

ఐ.పోలవరం(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పుతో దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్‌కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మాలమహానాడు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఐ.పోలవరంలో రాకేష్‌కిషోర్ చిత్రపటాన్ని దహనం చేశారు. రాకేష్‌కిషోర్‌పై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు రేవు శ్రీను, వడ్డి గౌతమ్, రేవు యజ్ఞశ్రీ, సాధనాల బాబూరావు, మట్ట గగనవీరుడు, తాళ్ళూరి ప్రసాద్, మోకా రవి, పండు చంద్రరావు, సాధనాల శివ, నక్కా రామకృష్ణ, భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

అప్పారావుకు ఘన నివాళి


అప్పారావుకు నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

అవులా పురం,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): పాత్రికేయ రంగంలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించిన సీనియర్ జర్నలిస్టు అడపా అప్పారావు ఆకస్మిక మృతిపట్ల అమలాపురం జర్నలిస్టులు ప్రగాడ సంతాపం తెలిపారు. స్థానిక గడియార స్తంభం సెంటర్లో అప్పారావు చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. జర్నలిస్టు యూనియన్ నాయకుడు టీకే విశ్వనాథ్, ఎలక్ట్రానిక్ మీడియా ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కొర్లపాటి ప్రదీప్‌కుమార్, జర్నలిస్టు నేతలు సుంకర ప్రసాద్, మద్దింశెట్టి త్రిమూర్తులు, కాకిలేటి సూరిబాబు, నిమ్మకాయల సతీష్, ఉండ్రు ప్రసాద్, మహ్మద్ బషీర్, అరిగెల రుద్రశ్రీనివాస్, పిండి శేషు, దొమ్మేటి వెంకట్, ఎం.వెంకటేష్, విజయ్, భాస్కర్, అరిగెల వసంత్, ఆసుభరత్, పరమట భీమామహేష్, రాము, రాము పాల్గొన్నారు.

కాన్షీరామ్ వర్ధంతి

ఉప్పలగుప్తం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతిని గురువారం పెదపూడిలో జరుపుకున్నారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, కొంకి మునీంద్ర, నందిక కృష్ణమూర్తి, అయితాబత్తుల వెంకట్రావు, గుదే శ్రీనివాసరావు, అయితాబత్తుల ఈశ్వరరావు, కొంకి విజయ్‌కుమార్, పొద్దోకు నాగేంద్ర, తాళ్ళ బాబ్జి, కొంకి సత్యవతి పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి స్థానికులకే కేటాయించాలి

●నియోజకవర్గ ఎస్సీ నాయకుల సమావేశం


అంబాజీపేటలో సంఘీభావం తెలుపుతున్న ఎస్సీ నాయకులు

అంబాజీపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి స్థానిక ఎస్సీ నేతలకు కేటాయించాలని నాయకులు డిమాండ్ చేశారు. అంబాజీపేట వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం ఎస్సీ సెల్ నాయకులు గుమ్మడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గ ఎస్సీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశంపార్టీ కోసం కష్టించి పనిచేసిన తమలో ఉన్న స్థానిక ఎస్సీ నేతకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేటాయించాలన్నారు. స్థానికేతరులకు ఇన్‌చార్జ్ కేటాయిస్తే పార్టీకి నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. నాయకులు నేదునూరి వీర్రాజు, నక్కా సునీల్‌రాజు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, చిన్నం బాలవిజయరావు, సుబ్బారావు, సర్పంచ్‌లు శ్రీనివాస్, బాలరాజు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

యానాంలో చైన్‌స్నాచర్ అరెస్టు

● 38గ్రాముల బంగారం స్వాధీనం


చైన్‌స్నాచర్‌తో యానాం పోలీసులు

యానాం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): యానాం కనకాలపేటలో నివాసం ఉంటున్న ఒక చైన్‌స్నాచర్‌ను అరెస్టుచేసి 38 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు యానాం కనకాలపేటలో బడ్డీకొట్టు నిర్వహిస్తున్న నల్ల శేషారత్నం అనే మహిళ మెడలో నుంచి సుమారు 38 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లిన చోరీ కేసును గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. కడపకు చెందిన రాచావరపల్లి సుబాష్‌చంద్రబోస్ అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతకొంత కాలంగా (6సంవత్సరాలుగా) కనకాలపేటలో నివాసం ఉంటూ చికెన్‌షాపులో పనిచేస్తున్నాడు. షాపుదగ్గరకు వెళ్లి ఎవ్వరూ లేని సమయంలో మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిపోయాడు. దీంతో ఒక్కసారిగా ఆమె కేకలు వేయ డంతో బంగారంతో పారిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిందితుడు తీసుకువచ్చిన మోటారుసైకిల్ ఆధారంగా గంటల వ్యవధిలోనే నిందుతుడిని పట్టుకుని అతని వద్ద నుంచి మూడు లక్షల యాభైవేల విలువ చేపే 38గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశం అనంతరం నిందుతుడిని కోర్టులో హాజరుపరిచి అనంతరం సబ్‌జైలుకు తరలించారు. ఎస్పీ పి.వరదరాజన్, సీఐ అడలరసన్, ఎస్ఐలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనాల పంపిణీ

పి.గన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్ర మంలో భాగంగా గురువారం వేణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణులు భోజనాలు అందించారు. ఈసందర్భంగా వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరావు, సూపరింటెండెంట్ డాక్టర్ యు.రాఘవేంద్రరావులతోపాటు పలువురు నాయకులు 200మంది గర్భిణులకు భోజనాలు అందించారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ కోట రాజేంద్రప్రసాద్, నల్లా పెద్దకాపు, గిడ్డి ఆనందరావు, మేడిది సాయిబాబు, తోలేటి సారధి, కొర్లపాటి సూరిబాబు, తోలేటి సుబ్బారావు, నేలపూడి రామకృష్ణ, ఆకాశం బాబి, వెంకటేశ్వరావు, అప్పన్న, ప్రసాద్, సాయిరామకృష్ణ, బత్తుల ప్రసాద్ పాల్గొన్నారు.


పి.గన్నవరం సీహెచ్‌సీలో గర్భిణులకు భోజనాలు అందిస్తున్న దృశ్యం

మాజీ మంత్రి జక్కంపూడికి ఘన నివాళి

పి.గన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు వర్ధంతి సందర్భంగా స్థానిక నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరాం ఆధ్వర్యంలో అక్విడెక్టు వద్ద గురువారం వర్ధంతి కార్యక్రమం ఏర్పాటుచేశారు. జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. మందపాటి కిరణ్ కుమమార్, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, అడ్డగళ్ల శ్రీను, అప్పన సూరేష్‌నాయుడు, ఎస్. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల నాయకుడు జక్కంపూడి

మామిడికుదురు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల నాయకుడు జక్కంపూడి రామ్మోహనరావు అని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి పేర్కొన్నారు. మామిడికుదురులో జక్కంపూడి వర్ధంతిని పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కొమ్ముల రాము, జక్కంపూడి వాసు, తోరం బాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, కాండ్రేగుల బాబి, కుసుమ శ్రీను, గెడ్డం వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరుడిని దర్శించున్న జడ్పీ సీఈవో దంపతులు


మురమళ్ళ వీరేశ్వరస్వామి సన్నిధిలో జడ్పీ సీఈవో దంపతులు

ఐ.పోలవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ సీఈవో లక్ష్మణరావు దంపతులు గురువారం మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సీఈవో దంపతులకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. సీఈవో దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వారికి స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.

చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

యానాం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞానవేదిక చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్‌ను యానాం విద్యాశాఖకార్యాలయంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణప్రవీణ్ ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా పర్యావరణ కమిటీ కన్వీనర్, జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాంప్రసాద్ మాట్లాడుతు జనవిజ్ఞాన వేదిక 35 సంవత్సరాలుగా విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంచేందుకు చెకుముకి సైన్సు మాసపత్రిక నడుపుతుందని, ప్రతిసంవత్సరం నాలుగుస్థాయిల్లో ఈ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. యానాం కమిటీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు మాట్లాడుతూ పాఠశాలస్థాయిలో అక్టోబరు 18న, బ్లాక్ లెవెల్ నవంబరు 1, జిల్లాస్థాయి నవంబరు 23న, రాష్ట్రస్థాయిలో డిసెంబరు 12 నుంచి 14వరకు నిర్వహిస్తారు. దాట్ల దేవదానం రాజు, ఉపాధ్యాయులు పెసల జయరామయ్య, కాశి కరుణ, శాస్త్రి, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

అంబాజీపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తొండవరం హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఉద్యోగ విరమణ పొందిన గాదె శ్రీనివాసరావు సన్మాన సభ హెచ్ఎం పీవీ కేశవచార్యులు అధ్యక్షతన గురువారం జరిగింది. శ్రీనివాసరావు దంపతులను దుశ్శాలువా,పూలమాలతో సత్కరించారు.

నేడు శశివదనే సినిమా విడుదల

అల్లవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గౌరినాయుడు సమర్పణ ఉబ్బన సాయిమోహన్ దర్శకత్వంలో రక్షిత్, కోమల హీరో హీరోయిన్‌గా నటించిన ప్రేమకథ చిత్రం శశివదనే శుక్రవారం విడుదల అవుతుందని నిర్మాతలు బెల్లం కొండ హయితేజ, అభిలాష్‌రెడ్డిలు తెలిపారు. గోదావరి తీరంలో కోనసీమ అందాల నడుమ తీసిన ప్రేమకథ చిత్రమే శశివదనే సినిమా అన్నారు. రక్షిత్ కోమల హీరో హీరోయిన్‌లతో పాటు తమిళ నటుడు శ్రీమాన్, దీపక్‌ప్రిన్సిన్ జబర్దస్త్ బాబీ, నాయుడు మోరం, స్వామినాయుడు తదితరులు నటిస్తున్నారన్నారు. శ్రవన్‌వాసుదేవన్ సంగీత దర్శకునిగా సాయికుమార్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు.

మండపేట

రావులమ్మ విగ్రహం ఊరేగింపు

ఆలమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆలమూరు గ్రామదేవత రావులమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గురువారం ఆలయంలోని పాత అమ్మవారి విగ్రహాన్ని పూజల అనంతరం తొలగించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



రాయవరంలో బాణసంచా పేలుడు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం, ప్రజా సంఘాల నేతలు

బాణసంచా పేలుడు ఘటన దురదృష్టకరం

రాయవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాయవరం శివారు ప్రాంతంలో జరిగిన బాణసంచా ఘటన దురదృష్టకరమని టీడీపీ సీనియర్ నేతలు ఉండవిల్లి రాంబాబు, చంద్రు వీర్రాజు అన్నారు. రాయవరంలో గురువారం వారు మాట్లాడుతూ ప్రమాద బాధితులు, మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మండలంలోని లొల్ల గ్రామంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు మాట్లాడుతూ బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించడం బాధాకరమన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి: రాయవరంలో బాణసంచా పేలుడు జరిగిన ప్రాంతాన్ని గురువారం సీపీఎం నేతలు సందర్శించారు. ఈసందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. గాయపడిన వారి కుటుంబాలకు 5 లక్షల సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గా ప్రసాద్, ఎం.బలరాం, సీపీఎం సీనియర్ నేత కొవ్వూరి సత్తిరెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి, ఎస్.కృష్ణకుమారి, ఎం.కమల శ్రీసత్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.నరేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

బాణసంచా తయారీ కేంద్రం సీజ్: రాయవరం శివారులో జరిగిన బాణసంచా ఘటన నేపథ్యంలో దాని సమీపంలో ఉన్న శ్రీభవాని ఫైర్ వర్క్సును గురువారం అధికారులు ముందస్తు చర్యగా సీజ్ చేశారు. తహసీల్దారు భాస్కర్ ఆధ్వర్యంలో అధికారులు దాన్ని సీజ్ చేశారు. నిబంధనలను పరిశీలించిన తరువాత వారికి అనుమతులు ఇవ్వనున్నారు.

అక్రమంగా మందుగుండు సామగ్రి ఉంటే కఠిన చర్యలు

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మందుగుండు సామగ్రి, దీపావళి టపాసులు నిలువ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీబాషా హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించారు. గతంలో తాత్కాలికంగా దీపావళి టపాసుల విక్రయాల కోసం లైసెన్సులు పొందిన షాపులు, ఇళ్ల, గొడౌన్‌లలో సోదాలు చేశారు. టపాసులు నిలువ చేసినా కఠిన చర్యలు తీసుకోవడం తోపాటు వాటిని సీజ్ చేస్తామన్నారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలి

మండపేట, (ఆంధ్రజ్యోతి): రాయవరంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.30 లక్షలు అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూళి జయరాజు డిమాండ్ చేశారు. గాయపడిన క్షతగాత్రులకు రూ.5 లక్షల పరిహారం అందించాలని కోరారు. గురువారం ఆయన మండపేటలో మాట్లాడుతూ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించకపోవటం పట్ల విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర విపత్తుల శాఖ మంత్రి అనిత వచ్చి పరిశీలించారని పరిహారం ప్రకటించకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. గురువారం కాకినాడ వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాయవరం ఘటనా ప్రదేశానికి రాకపోవడాన్ని తప్పుపట్టారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జీఎస్టీ తగ్గింపుతో ఎన్నో లాభాలు

• ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు • అవగాహన ర్యాలీలు

ఆలమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం వల్ల ప్రజలకు ఎంతో లాభదాయకమని వైద్యాధికారులు అన్నారు. గురువారం ఆలమూరు సీహెచ్‌సీ, పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీలలో జీఎస్టీ సేవింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాణాంతక వ్యాధులకు సంబంధించిన మందులపై జీఎస్టీని రద్దు చేయడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఆరోగ్య వైద్య పరికరాలతో పాటు మరికొన్ని మందులపై 12 నుంచి 5 శాతానికి తగ్గించారని వైద్యులు ఎం.శివశంకర్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నట్టు నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు తదితరులు అన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు నెలవారీ ఖర్చులు తగ్గుతున్నాయని ఎంపీపీ పంపన నాగమణి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.రమణ కుమారి అన్నారు. గురువారం కుందూరు, పామర్రు, దంగేరు, పేకేరు ఆసుపత్రుల ఆవరణ లో జీఎస్టీ తగ్గింపులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కుందూరులో సభకు హాజరైన జీఎస్‌టీవో రమణకుమారి మాట్లాడుతూ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో తగ్గిన వస్తువుల ధరలపై వివరించారు. నిత్యావసరాల ధరలు, మందులు, వైద్య పరికరాలు, కొన్ని రకాల మందులపై జీఎస్టీ తొలగించిన అంశాలను వివరించారు. పామర్రులో డాక్టర్ మహ్మద్ అలీమ్‌లు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కుందూరు సొసైటీ అధ్యక్షుడు జగతా వెంకట రమణారావు, సర్పంచ్ పంపన సత్యానందం, వాసంశెట్టి సూరిబాబు, ఎంపీహెచ్‌వో వి.వీర ప్రకాషరావు, ఎస్‌వీ కామేశ్వరరావు, భాగ్యవతి, ఏఎన్‌ఎంలు, కూటమి నాయకులు పళ్ల చిన బాబు, కట్టా నాగేశ్వరావు, కొరిపెల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు ఊరట

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన జీఎస్‌టీతో సామాన్య ప్రజలకు ఎంతో ఊరట కలుగుతుందని కూటమి నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం రామచంద్రపురం టీడీపీ కార్యాలయంలో సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలు, వ్యాపారుల వద్దకు వెళ్లి సూపర్ జీఎస్‌టీ, సూపర్ సేవింగ్స్ పత్రాలు అందజేసి చేకూరే ప్రయోజనాలు వివరించాలని కోరారు. ఈనెల 19 వరకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కోఆర్డినేటర్ పలివెల ప్రకాష్ మాట్లాడుతూ మై టీడీపీ యాప్ ఉపయోగం, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, మాజీ ఏఎంసీ చైర్మన్లు కొమరిన వీర్రాజు, గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వుండవిల్లి శివ, జాస్తి విజయలక్ష్మి, పెంకె సాంబశివరావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని అంగర గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అన్నారు. గురువారం మం డలంలోని అంగర పీహెచ్‌సీలో వైద్యాధికారి రత్నకుమారి అధ్యక్షతన సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్‌పై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామారావు, హెచ్‌వీ మేరీమణి, హెచ్‌ఎస్ నానిబాబు, ఇన్సూరెన్స్ ఏజెంట్ లీలవిజయ, జీఎస్టీ చాంపియన్ రామలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అవగాహన ర్యాలీ

ఆలమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ అధికారి ఈదర రాంబాబు అన్నారు. చొప్పెల్లలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చొప్పెల్ల శాఖ అధ్వర్యంలో గురువారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ ఎం.లక్ష్మిచైతన్య, మేనేజరు కె.ఉదయ్‌కుమారి, అధికారులు ఎం.సాగర్, ఆర్.సంతోష్‌కుమార్, రాంబాబు, దుర్గయ్య, చందు తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో ఆలయాన్ని పరిశీలిస్తున్న పుష్కరాల బృందం

పుష్కర నిధులతో అభివృద్ధికి ప్రణాళికలు

ఆలమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వచ్చే పుష్కరాలకు ఆలయాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంలో భాగంగా దేవాదయశాఖ బృందం గురువారం మండలంలోని పలు ఆలయాలను పరిశీలించి అభివృద్ధి పనులను గుర్తించారు. దేవాదయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.సత్యనారాయణ, రామచంద్రపురం తనిఖీ అధికారి బాలాజీరామ్‌ప్రసాద్, ఏఈ ఫణీ, దేవాదయ శాఖ మండల అధికారి ఎంఎస్ఆర్.కృష్ణ అధ్వర్యంలో మండలంలోని మడికి, ఆలమూరు, చొప్పెల్ల, నర్సిపూడి, పెనికేరు, మోదుకూరు, పెదపళ్ల, నవాబుపేట, మూలస్థానం, జొన్నాడ, చింతలూరు, పినపళ్ల, సంధిపూడి గ్రామాల్లో దేవదయశాఖ ఆధీనంలో ఉన్న ఆలయాలను పరిశీలించారు. ఆయా ఆలయాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానిక నాయకులు, అధికారులు, అర్చకులతో చర్చించి పలు పనులకు ప్రతిపాదనలు తయారు చేశారు. ఆయా ఆలయాల్లో రికార్డులను తనిఖీలు చేసినట్టు మండల దేవాదయశాఖ అధికారి కృష్ణ తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మండపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గానికి చెందిన పలువురు వివిధ వ్యాధులతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న 27 మందికి మంజూరైన రూ.10లక్షల 87వేలు ఎల్‌వోసీలను స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్నవారంతా ఈకేవైసీ చేయించుకోవాలి

కపిలేశ్వరపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు కలిగి ఉన్న ఉపాధి హామీ కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలని గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రంజిత్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని అంగర, పడమరఖండ్రిక గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయం వద్ద ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధ్యక్షతన ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంగరలో 75 ఉపాధి పనులను, పడమరఖండ్రికలో 73 ఉపాధి పనులను ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు బోణం శ్రీరాములు, నేల సునీత వీరమణి గ్రామసభలో వినిపించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు, దాసరి ఆంజనేయులు, మత్స గంగరాజు, చోడే సుబ్రహ్మణ్యం, గండారపు వీరబ్రహ్మం, పి.తంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అట్లతద్ది వేడుకలు



కపిలేశ్వరపురం మండలం అంగరలో గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

ఆలమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో మహిళలు అట్లతద్దిని ఘనంగా నిర్వహించారు. ఉపవాసాలు ఉండి సాయంత్రం కాలువలు, గోదావరి, చెరువుల వద్ద గౌరిదేవికి పూజలు నిర్వహించారు. ఇంటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పలువురు ముత్తైదువులకు వాయినాలు అందించారు. ఆలమూరు, బడుగువానిలంక గ్రామాల్లో పలు మహిళలు ఉయ్యాల ఊగుతూ సందడి చేశారు. లంక గ్రామాల కూడలిగా ఉన్న చెముడులంక, మడికి, జొన్నాడ, పెదపళ్ల, సంధిపూడి, ఆలమూరు, గుమ్మిలేరు, నర్సిపూడి, పెనికేరు, చింతలూరు తదితర గ్రామాలలో మహిళలు అట్లతది సందడి చేశారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ)(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణం, మండలంలో మహిళలు అట్లతద్ది వేడుకను గురువారం సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసాలు ఉండి గౌరీదేవి పూజలు నిర్వహించారు. సాయంత్రం కాలువల వద్ద పలువురు మహిళలు పూజలు చేశారు. వరికంకులకు పూజలు జరిపారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో మహిళలు అట్లతద్ది పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం కాలువల వద్దకు వెళ్లి గౌరీదేవికి పూజలు చేశారు. రాత్రి ఆకాశంలో చంద్రుడిని చూసిన అనంతరం ఉపవాస దీక్షను విరమించారు. కొత్తగా పెళ్లైన యువతులకు పలువురు మహిళలు వాయినాలు అందజేశారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు గురువారం అట్లతద్ది పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఉపావాసాలు ఉండి సాయంత్రం కాలువల వద్ద గౌరీదేవికి పూజలు చేశారు. కొత్తగా పెళ్లి చేసుకున్న పలువురు మహిళలకు తద్దివాయినాలు ఇచ్చారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం మహిళలు అట్లతద్దిని ఘనంగా జరుపుకున్నారు. కాలువ రేవులు, గోదావరి పుష్కర ఘాట్లు అట్లతద్ది పూజలు నిర్వహిస్తున్న మహిళలతో కళకళలాడాయి. మహిళలు వరికంకులు, పుష్పాలతో గౌరీ, తులసిమాతలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి మహిళలకు అట్లవాయినం అందజేశారు. ఆయా గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

మండపేట (ఆంధ్రజ్యోతి): మండపేటలో గురువారం అట్లతద్ది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా మహి ళలు తమ వాయినాల మొక్కును తీర్చు కున్నారు. ఉదయం ఉపవాసం ఉండి సాయం త్రం చంద్రుడిను చూసి ఉపావాస దీక్షను విరమించారు. మండపేటతోపాటు రూరల్ గ్రామాల్లో అట్లతద్దిని జరుపుకున్నారు.



రావులపాలెం రింగ్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బ్రహ్మోత్సవాల స్వాగత ద్వారం

వాడపల్లి బ్రహ్మోత్సవాలపై స్వాగత ద్వారం ఏర్పాటు

రావులపాలెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రావులపాలెంలో స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. నేటి నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆయా ఏర్పాట్లను పూర్తి చేశారు. రావులపాలెం నుంచి వాడపల్లి వెళ్లే రింగ్ రోడ్డు వద్ద బ్రహ్మోత్సవాల స్వాగత ద్వారాన్ని ఏర్పాటు చేశారు.



అఖిలపక్ష జేఏసీ సంఘీభావ దీక్షకు మద్దతు తెలుపుతున్న నాయకులు

కాకినాడ జిల్లాలో కలపాలని సంఘీభావ దీక్షకు మద్దతు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని అఖిలపక్ష జేఏసీ చేపట్టిన సంఘీభావ దీక్షకు గురువారం పలువురు మద్దతు తెలిపారు. నియోజకవర్గ అఖిలపక్ష జేఏసీ గౌరవ అధ్యక్షుడు డా.చెలికాని స్టాలిన్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘాల గౌరవ అధ్యక్షుడు పడాల రాము, మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు అఖిలపక్ష జేఏసీని ఉద్దేశించి మద్దతు తెలిపారు. అఖిల పక్ష జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో కన్వీనర్ బి.సిద్ధూ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, సీపీఐ నాయకులు పి.రాము, వైసిపి పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, టిడిపి నాయకులు నారపురెడ్డి బలరామ్, జనసేన సీనియర్ నాయకులు అంకం శ్రీను, కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ నాయుడు మాస్టారు, డైరెక్టరు మార్ని సుబ్బారావు, సిపిఐ నాయకురాలు శారద తదితరులు మాట్లాడారు. నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలనే డిమాండు మీద మంత్రి సుభాష్ మౌనం వీడి ఎప్పుడు విలీనం చేస్తారో ప్రకటించాలని వక్తలు కోరారు. తమ ఉద్యమాన్ని త్వరలో తీవ్రతరం చేస్తామని రామచంద్రపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఒక్కరోజు పట్టణ బంద్‌కు పిలుపునిచ్చిందని త్వరలో తేదీని తెలియచేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వి.భీమశంకరం, చింతా రాజారెడ్డి, న్యాయవాది గాలింకి చిట్టిబాబు, ఎంఆర్‌పీఎస్ నాయకులు మందపల్లి చిట్టిబాబు, పీడీఎస్‌యు నాయకులు పాల్గొన్నారు.

లొల్ల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ఆత్రేయపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంధ్ర రాష్ట్ర పురస్కారం అందుకున్న లొల్ల గ్రామాన్ని ఆదర్శవంతంగా తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. లొల్లలో స్వచ్ఛంధ్ర రాష్ట్ర అవార్డు అందుకున్న సర్పంచ్ కె.జగన్నాథంతో పాటు కార్యదర్శి సిబ్బందిని ఎమ్మెల్యే సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నదన్నారు. గ్రామాభివృద్ధికి రూ.10లక్షలు ప్రత్యేక గ్రాంటును మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బాబు, మెర్ల శ్రీరామచంద్రమూర్తి, మేడిద సత్తిబాబు, సాయిరామ్, తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, కార్యదర్శి కేఎస్ఎఆర్ కృష్ణామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనాను గురువారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పోలీస్ జిల్లా కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాతో సత్కరించి మొక్క అందించారు. శాంతి భద్రతల పరిరక్షణ తదితర అంశాలపై వారు చర్చించారు.

చేనేత కార్మికులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలి

కపిలేశ్వరపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. అంగర శ్రీ గణపతి చేనేత సహకార సంఘం వద్ద చేనేత కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 12వ రోజుకు చేరాయి. చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్.కోటేశ్వరరావు, సి.ఏడుకొండలు, ఎస్. సాయికిరణ్, తాళ్ళ గంగయ్య, అల్లక భద్రరావు, విశ్వనాధుల సత్యనారాయణలు విలేకర్ల సమావేశంలో తమ గోడును చెప్పు కున్నారు. పన్నెండు రోజులుగా దీక్ష చేస్తున్నా తమకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నదని వాపోయారు. దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తదితరులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. పోస్టుకార్డుల ద్వారా తమ ఆవేదనను ప్రభుత్వ పెద్దలకు తెలియజేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామంలోని చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ నాయకులకు స్వాగతం

రావులపాలెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కోనసీమ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ జేఏసీ అధ్యక్షులు ఆలపాటి విద్యాసాగర్, కార్యదర్శి డీవీ రమణకు రావులపాలెం ముఖద్వారం వద్ద స్వాగతం పలికారు. కొత్తపేట తాలుకా ఏపీఎన్జీవో అధ్యక్షులు మోటూరి రామారావు ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలలతో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేసేందుకు అడహాక్ కమిటీ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో కోనసీమకు వచ్చామన్నారు. ఉద్యోగులకు పెన్షనర్లకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు త్వరలో పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. అంశాల వారీగా అన్ని డిమాండ్లను సాధించుకుందన్నారు. కార్యక్రమంలో కొత్తపేట ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షులు కొవ్వూరి ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి నల్లా రామారావు, యేషుగంటి సురేష్, చంద్రశేఖర్, శివఅప్పారావు, బోనం కృష్ణమూర్తి, బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.